
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



రేపే వేడుక

తుదిదశకు చేరిన ఏర్పాట్లు



సిద్ధమవుతున్న శంకుస్థాపన పైలాన్



యుద్ధప్రాతిపదికన జంగిల్ క్లియరెన్స్ పనులు

విధ్వంసం నుంచి పునర్వికాసం

మళ్లీ పురుడు పోసుకుంటున్న అమరావతి

- అందంగా ముస్తాబైన అమరావతి
- రాజధాని రైతుల ఇళ్లకు వెళ్లి ఆహ్వానం
- శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల సందడి
- ప్రధాని పర్యటనకు పక్కా ప్రణాళిక

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రాజధాని పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవానికి అమరావతి ఆహ్వానం పలుకుతోంది. ప్రపంచస్థాయి నగరి కోసం భూములిచ్చిన రైతులకు సీఆర్‌డీఏ మహిళా అధికారిణులు ఇంటింటికీ వెళ్లి బొట్టుపెట్టి ఆహ్వానం పలుకుతున్నారు.

● అమరావతిలో చేపట్టే రూ.49,040 కోట్ల పనులకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ శంకుస్థాపన చేయనున్నారు. శాశ్వత హైకోర్టు, సచివాలయం, అసెంబ్లీ భవనాలతో మిగతా 6లో..

చకచకా ఏర్పాట్లు

రాజధాని శంకుస్థాపన సందర్భంగా ప్రత్యేక పైలాన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. గురువారం నాటికి ఇది పూర్తవుతుంది. సభా వేదిక ఏర్పాట్లను ఇప్పటికే పూర్తిచేశారు. ప్రధాన వేదికలు, గ్యాలరీలు, అందులో సోఫాలు, కుర్చీలు, కూలర్లు సిద్ధంచేశారు. రాజధానిలో రోడ్ల డివైడర్లకు రంగులు వేశారు. పెద్ద ఎత్తున పూలకుండీలను తెప్పించి అలంకరిస్తున్నారు.

అద్భుతం.. అంతకుమించిన ఆశ్చర్యం.. అన్నింటికీ మించిన ఆనందం.. ఐదేళ్ల వైసీపీ విధ్వంస బంధనాల నుంచి విముక్తి కలిగి రాజధాని కొత్తగా రెక్కలు తొడిగే ఓ శుభ సందర్భం. ఇన్నాళ్లూ అడవిలా అట్టుడికిన అమరావతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే ఓ సువర్ణాధ్యాయం. అందరూ ఆశగా ఎదురుచూస్తున్న రాజధాని పునర్నిర్మాణ శంకుస్థాపనకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో అమరావతిలో పండుగ వాతావరణం రెట్టింపు అవుతోంది. ఈ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రానుండటం, రూ.లక్ష కోట్ల విలువైన పనులకు శ్రీకారం చుట్టడంతో అందరూ అమరావతివైపు ఆశగా చూస్తున్నారు.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి

ఐదేళ్ల వైసీపీ బంధనాల నుంచి విముక్తి

- కూటమి ప్రభుత్వం వచ్చాక పది నెలల్లో కొత్తగా..
- అడవి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకూ..
- పునర్నిర్మాణ శంకుస్థాపనకు అంతా సిద్ధం
- ఆ తర్వాత మహాయజ్ఞంలా పనులు




వైసీపీ హయాంలో ఇలా..

2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ మూడు రాజధానుల పేరు చెప్పి అమరావతిని నాశనం చేసింది. అంతకుముందు టీడీపీ ప్రభుత్వం చేపట్టిన పనులను నిలుపుదల చేయించింది. కేంద్ర సంస్థలకు కూడా భూములివ్వలేదు. అమరావతితో అనుసంధానమైన జాతీయ రహదారి, నూతన రైలుమార్గం పనులకు సహకరించలేదు. మూడు రాజధానులు అని ఒకవైపు చెబుతూ.. అమరావతిని కనీస రాజధానిగా కూడా గుర్తించకుండా అభివృద్ధి విఘాతానికి పాల్పడింది.

కూటమి ప్రభుత్వం వచ్చాక..

టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ అమరావతిపై ఆశలు ఏర్పడ్డాయి. ఐదేళ్ల విధ్వంసాన్ని సరిచేయడానికి అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. అంచనాలు పెరిగి భారం మరింత పెరిగింది. నీటిలో నిండిపోయిన ఐకానిక్ భవనాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అయినా మొక్కవోని ధైర్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఐఐటీ నిపుణులతో పరీక్ష చేయించింది. యాక్షన్ ప్లాన్‌ను తయారు చేసుకుంది. చివరిగా ఈ పనులన్నింటినీ పూర్తి చేయటానికి అవసరమైన నిధులు లేక ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో దాదాపు రూ.15 వేల కోట్లను మిగతా 6లో..



వెస్ట్ బైపాస్‌లోని కృష్ణా బ్రిడ్జి

రాజమార్గం

- అందుబాటులోకి విజయవాడ బైపాస్
- అమరావతి శంకుస్థాపనకు ఇదే దారి

6లో

- ఏలూరు జిల్లా నుంచి వచ్చే వారంతా చిన అవుటపల్లి మీదుగా..
- ఎన్టీఆర్ జిల్లా నుంచి వచ్చే వారంతా గొల్లపూడి మీదుగా..
- అమరావతిలో వెంకటపాలెం నుంచి సభాస్థలికి నేరుగా..

ఏర్పాట్లు దాదాపు పూర్తి

అమరావతిలో మంత్రి నారాయణ పర్యటన



విజయవాడ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటనకు సంబంధించి అమరావతిలో సభావేదిక, పార్కింగ్ సహా మిగతా ఏర్పాట్లన్నీ దాదాపు పూర్తయ్యాయని మంత్రి నారాయణ తెలిపారు. అమరావతిలో ప్రధాని పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు పర్యవేక్షించడానికి వెళ్లిన ఆయన బుధవారం అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపనకు ప్రజలు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉండటంతో పార్కింగ్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. తోపులాటకు తావులేకుండా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను అప్రమత్తం చేస్తున్నామని చెప్పారు. వర్షం వస్తే పార్కింగ్‌కు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయం చూడాలన్న సీఎం చంద్రబాబు సూచనలతో మిగతా 6లో..

ఎంఎస్ఎంఈకి 10 ఎకరాలు

పామర్రు మండలం ఐనంపూడిలో ఎంపిక

- స్వాధీనం చేసుకున్నట్టు కలెక్టర్ ఉత్తర్వులు
- 7వ తేదీలోపు పరిశ్రమలకు కేటాయింపు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : పామర్రు నియోజకవర్గం ఐనంపూడిలో 10 ఎకరాలకుపైగా ఉన్న ప్రభుత్వ భూమిని ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు) కోసం ఎంపిక చేశారు. ఈ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు కలెక్టర్ బాలాజీ రెండు రోజుల కిందట ఉత్తర్వులు జారీ చేశారు. పామర్రు రెవెన్యూ అధికారులు ఈ భూములను పరిశీలించారు.

ప్రభుత్వ ఆదేశాలతోనే..

జిల్లాలో పరిశ్రమల స్థాపన కోసం మిగులు భూములను గుర్తించి, నివేదికలు పంపాలని ప్రభుత్వం.. ఇటీవల తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేసింది. పామర్రు నియోజకవర్గం ఐనంపూడిలో 10 ఎకరాలకు పైగా మిగులు భూమి ఉన్నట్లు గుర్తించిన స్థానిక అధికారులు కలెక్టర్‌కు నివేదిక పంపారు. దీంతో వెంటనే జిల్లాలో పరిశ్రమలకు కేటాయించేందుకు గాను ఈ భూములు స్వాధీనం చేసుకుంటూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీఐఐసీకి ఈ భూములను అప్పగించి, దానిద్వారా ఇక్కడ ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేయాలనే అంశంపై అధికారులు, పాలకులు చర్చలు జరుపుతున్నారు. భూమి స్వాధీన ప్రక్రియ పూర్తికాగా, ఈ నెల 7వ తేదీలోపు ఏ పరిశ్రమలకు కేటాయించాలనే అంశంపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఈ మేరకు మిగతా 6లో..



పోలీసులతో షర్మిల వాగ్వాదం

గన్నవరంలో గరంగరం

షర్మిల హౌస్ అరెస్టుతో ఉద్రిక్తత

సమస్యలపై మాట్లాడే హక్కు లేదా: షర్మిల

విజయవాడ/గన్నవరం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఏపీసీసీ చీఫ్ షర్మిల హౌస్ అరెస్టుతో గన్నవరం మండలం కేసరపల్లి ఎస్ఎల్వీలోని ఆమె నివాసం వద్ద బుధవారం ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. 2న అమరావతిలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో పోలీసులు ముందస్తుగా షర్మిలను హౌస్ అరెస్టు చేసేందుకు ఆమె నివాసానికి వచ్చారు. అప్పటికే షర్మిల విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌కు వెళ్లేందుకు బయల్దేరగా, పోలీసులు అడ్డుకున్నారు. అప్పటికే గేటు వరకు వచ్చిన షర్మిల పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. 'ప్రజా సమస్యలపై మాట్లాడే హక్కు మాకు లేదా? రాజధానిపై కమిటీ వేస్తే పోలీసులతో హౌస్ అరెస్టు చేయిస్తారా? లా అండ్ ఆర్డర్ సృష్టించేది, ప్రజలకు అన్యాయం చేసేది మేము కాదు. ప్రత్యేక హోదా, పోలవరం, రాజధాని విషయంలో ఎవరు అన్యాయం చేస్తున్నారో ప్రజలకు వివరించే బాధ్యత మాపై ఉంది.' అని షర్మిల మండిపడ్డారు. హౌస్ అరెస్టు చేసే క్రమంలో పోలీసులు తనపై చేయి కూడా వేశారని, ఇది సరికాదని, మిగతా 6లో..

మినుము రైతుకు ధరాఘాతం

క్వింటా మద్దతు ధర రూ.7,400 ఉంటే రూ.6,800కు కొంటున్న వ్యాపారులు

వారం క్రితం వరకు రూ.7,000కు విక్రయాలు

- నెల వ్యవధిలో క్వింటాకు రూ.వెయ్యి తగ్గింపు
- గతేడాది ఇదే రోజుల్లో రూ.9 వేలు పలికిన ధర
- ధర తగ్గడంతో రైతుల్లో ఆందోళన



ఆరబెట్టిన మినుము

ఈ ఏడాది మినుము మద్దతు ధర రోజురోజుకూ తగ్గిపోవడం రైతులను కలవరపెడుతోంది. వారం కిందట క్వింటా మినుముకు రూ.7 వేలు ఇచ్చిన వ్యాపారులు ఇప్పుడు రూ.6,800కు కొంటున్నారు. మార్చి చివరి వారంలో రూ.7,800 ఉండగా, నెలలో వెయ్యి రూపాయలు తగ్గించారు. గతేడాది ఇదే రోజుల్లో క్వింటా రూ.9 వేల వరకు రైతులు విక్రయించారు. ఈ ఏడాది రూ.6,800కు చేరడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఈ ఏడాది రబీ సీజన్‌లో జిల్లాలో 3.50 లక్షల ఎకరాల్లో మినుము సాగు చేశారు. మార్చి నెలాఖరు నాటికి మినుము తీత పనులు పూర్తయ్యాయి. ఆ సమయంలో క్వింటా మినుములు బహిరంగ మార్కెట్‌లో రూ.7,800 వరకు వ్యాపారులు కొన్నారు. ఆ తర్వాత ధరను వ్యూహాత్మకంగా తగ్గిస్తూ వస్తున్నారు. బుధవారం నాటికి జిల్లాలో క్వింటా మినుములు రూ.6,800కు కొనుగోలు చేస్తామని, మినుము తూర్పారబట్టినందుకు, రవాణా ఖర్చుల కింద మరో మిగతా 6లో..



నేడు, రేపు ట్రాఫిక్ మళ్లింపు

- ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో అధికారుల నిర్ణయం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ గంగాధరరావు

6

దైవ సంకల్పంతో రాజధాని అభివృద్ధి

- ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు
- భువనేశ్వరి పీఠం నూతన భవనం నిర్మాణానికి శంకుస్థాపన

8లో

మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : మైనార్టీ, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అర్హులైన వారికి రుణాలు మంజూరు చేస్తున్నట్లు ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎన్టీఆర్ జిల్లా కార్యనిర్వాహక సంచాలకులు ఎస్.కె.ఫర్జానా బేగం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీలు (ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీకులు) ప్రభుత్వం ద్వారా ఇచ్చే వివిధ పథకాల సబ్సిడీ రుణాలు 2025-26 సంవత్సరానికి గాను 21 నుంచి 55 సంవత్సరాల లోపు వయస్సు గల మైనార్టీలకు రూ. లక్ష నుంచి రూ.8 లక్షల వరకు, క్రిస్టియన్ మైనార్టీలకు రూ. లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రుణాలను అందించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపిక అయిన వారికి 50 శాతం సబ్సిడీ మంజూరవుతుందని తెలిపారు. అర్హత కలిగిన వారు ఆన్‌లైన్ వెబ్‌సైట్ (హెచ్‌టీటీపీఎస్:// ఏపీఓబీఎంఎంఎస్. ఏపీసీఎఫ్ ఎస్ఎస్.ఇన్)లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఆఖరు తేదీ మే 25గా పేర్కొన్నారు. వివరాలకు 0866-2491148 ఫోన్ నెంబరు ద్వారా లేదా ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఎన్టీఆర్ సర్కిల్, పటమటలోని కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

గోల్డ్ మెడల్ సాధించిన శిరీషకు ఎంపీ కేశినేని చిన్ని అభినందనలు



శిరీషను శాలువాతో సత్కరిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో ఇందిరా గాంధీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఏప్రిల్ 25 నుంచి 27 వరకు నిర్వహించిన 2వ ఏషియన్ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్ షిప్‌లో బంగారు పతకం సాధించిన బి.శిరీషను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అభినందించారు. సీనియర్-ఏ విభాగంలో ఆర్టిస్టిక్ పెయిర్ విభాగంలో బంగారు పతకాన్ని సాధించిన శిరీష గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో బుధవారం ఎంపీ కేశినేని శివనాథ్‌ను కలిసింది. ఈ సందర్భంగా శిరీషను ఎంపీ అభినందించి శాలువాతో సత్కరించారు. శిరీష ఆంధ్రప్రదేశ్ తరపున పోటీ చేసి ఇండియా యోగాసన టీమ్‌కు వైస్ కెప్టెన్‌గా ఎన్నికైనందుకు ప్రత్యేకంగా ప్రశంసించారు. భవిష్యత్తులో ఇండియా తరపున పోటీ పడి అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి రాష్ట్రానికి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.

కార్మికుల సంక్షేమమే సీఎం చంద్రబాబు లక్ష్యం

కార్మికుల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎంపీ కేశినేని చిన్ని అన్నారు. ఉత్పత్తి, సేవా రంగాలను బలోపేతం చేసే దిశగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన పారిశ్రామిక విధానం, కార్మికులు పేదల జీవితాల్లో వెలుగు నింపుతుందన్నారు. గురువారం మే డే సందర్భంగా కార్మిక, శ్రామిక, కర్షక లోకానికి ఎంపీ కేశినేని శివనాథ్ శుభాకాంక్షలు చెబుతూ ఒక ప్రకటన విడుదల చేశారు.

ఢిల్లీని తలదన్నే రాజధాని ఎక్కడ!

- సీపీఎం కార్యదర్శివర్గ సభ్యుడు సిహెచ్.బాబూరావు

విజయవాడ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీని తలదన్నే రాజధాని నిర్మిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ 2014 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు హామీ ఇచ్చి, ఇంత వరకు రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి.హెచ్. బాబూరావు విమర్శించారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల కిందట మోదీ అమరావతికి శంకుస్థాపన చేసి నిధులు ఇస్తామని ఆశపెట్టి ఢిల్లీ నుంచి చెంబుడు నీళ్లు, గుప్పెడు మట్టితెచ్చి ప్రజల నోట్లో కొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని నిర్మాణం కేంద్రప్రభుత్వ బాధ్యతని, 2014-19 కాలంలో టీడీపీ, బీజేపీ హయాంలో రాజధాని నిర్మాణానికి రూ.42 వేల కోట్లు అవసరమని కేంద్రానికి నివేదికలు పంపినా, పదేళ్లలో కేంద్రం ఇచ్చింది రూ.1500 కోట్లు మాత్రమేనని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో అమరావతిని నిర్వీర్యం చేసిందన్నారు. అమరావతిలో నలభైకి పైగా కేంద్రప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలకు 300 ఎకరాలకుపైగా భూమి కేటాయించగా, అనేక విభాగాలు కనీసం స్థలాలు కూడా స్వాధీనం చేసుకోలేదన్నారు. రాజధాని నిర్మాణానికి అప్పులు ఇచ్చి రాష్ట్ర ప్రజలను అప్పుల పాలు చేయొద్దని విజ్ఞప్తి చేశారు.

పాలిసెట్‌కు 6,762 మంది హాజరు



పరీక్షా కేంద్రంలో విద్యార్థులతో మాట్లాడుతున్న సాంకేతిక విద్యాశాఖ అధికారి ఎ.రవికుమార్

భారతీనగర్, ఏప్రిల్30 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి గాను పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి ఎన్టీఆర్ జిల్లాలో బుధవారం నిర్వహించిన పాలిసెట్ -2025 ప్రశాంతంగా ముగిసింది. ఎన్టీఆర్ జిల్లాలోని మూడు ప్రధాన పట్టణాలైన నందిగామ, విజయవాడ, తిరువూరు ప్రాంతాలలోని మొత్తం 18 పరీక్షా కేంద్రాల్లో జరిగిన ఈ ప్రవేశ పరీక్షకు 6,762 మంది విద్యార్థులు హాజరయ్యారు. సాంకేతిక విద్యాశాఖ అధికారులు ఎ.రవికుమార్, బి.రమాసుందరి పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించారని ఎన్టీఆర్ జిల్లా కోఆర్డినేటర్, విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎం.విజయ సారధి తెలిపారు.



విజయవాడ వెస్ట్ బైపాస్



నూతనంగా నిర్మిస్తున్న కృష్ణా బ్రిడ్జి

రాజమార్గం!

విజయవాడ వెస్ట్ బైపాస్, కృష్ణా బ్రిడ్జిపై రాకపోకలకు అనుమతి

- నిర్మాణాలు పూర్తికాకపోయినా రాజధాని పునర్నిర్మాణ సభ నేపథ్యంలో అధికారుల నిర్ణయం
- ఏలూరు జిల్లా నుంచి వచ్చే వారంతా చిన్న అవుటపల్లి దగ్గర బైపాస్ ఎక్కుతారు..
- ఎన్టీఆర్ జిల్లా నుంచి వచ్చే వాహనాలు గొల్లపూడి సర్వీసు రోడ్డు నుంచి నూతనంగా నిర్మించిన కృష్ణా బ్రిడ్జిపైకి..
- కృష్ణా బ్రిడ్జి మీదుగా వెంకటపాలెం దిగి.. అక్కడి నుంచి సభాస్థలికి వాహనాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో ఇంకా నిర్మాణం పూర్తికాని విజయవాడ వెస్ట్ బైపాస్, కృష్ణా బ్రిడ్జి అందుబాటులోకి రానున్నాయి. ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల నుంచి సభకు తరలివచ్చే వాహనాలన్నింటినీ విజయవాడ పశ్చిమ బైపాస్ మీదుగా అనుమతించారు. విజయవాడ పశ్చిమ బైపాస్ పనులు ఇంకా పూర్తి కాలేదు. మధ్యలో కొన్ని ఆర్‌వోబీలు బయటకు చొచ్చుకు రావడంతో వాటిని పూర్తిగా తొలగించి పునర్నిర్మాణ పనులు చేస్తున్నారు. హైటెన్షన్ విద్యుత్ ట్రాన్స్‌మిషన్ లైన్ల సమస్య వల్ల కొన్ని చోట్ల ఆర్‌వోబీలు పూర్తి కాలేదు. అయినప్పటికీ ఆర్‌వోబీల ప్రాంతంలో రెండు వైపులా సర్వీసు రోడ్లు వేసి ఉండడం వల్ల విజయవాడ వెస్ట్ బైపాస్ మీదుగా రాకపోకలు సాగించడానికి ఎలాంటి ఇబ్బందులు లేవు. చిన్నఅవుటపల్లి నుంచి మర్లపాలెం, గన్నవరం, బీబీ గూడెం, కొండపావులూరు, సూరంపల్లి, పాతపాడు, జక్కంపూడి, గొల్లపూడి వరకు నేరుగా వాహనాలు రావడానికి అవకాశం ఉంది. గొల్లపూడి ఫ్లైఓవర్ దాటిన తర్వాత ఎన్‌హెచ్ - 65 పై ఉన్న ఆర్‌వోబీ మీదుగా సూరాయపాలెం నుంచి కృష్ణానదిపై కొత్తగా నిర్మితమైన కృష్ణాబ్రిడ్జి మీదుగా రాజధానిలోని వెంకటపాలెం గ్రామంలోకి వెళ్లి అక్కడ నుంచి సభాస్థలికి సమీపంలో ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్లేస్‌లోకి వాహనాలు చేరుకోనున్నాయి. కృష్ణా బ్రిడ్జి దాదాపుగా పూర్తికావచ్చింది. విజయవాడ నుంచి అమరావతికి వెళ్లే మార్గంలో ఒకవైపు పూర్తిగా కృష్ణా బ్రిడ్జి అందుబాటులోకి వచ్చింది. రెండో మార్గం ఇంకా అందుబాటులోకి రాలేదు.

ఒక మార్గం అందుబాటులోకి రావడంతో అమరావతి సభకు వచ్చే వాహనాలను అనుమతించాలని అధికారులు నిర్ణయించారు. ఏలూరు జిల్లా నుంచి వచ్చే వాహనాలన్నీ కూడా చిన్నఅవుటపల్లి దగ్గర విజయవాడ వెస్ట్ బైపాస్ ఎక్కి, గొల్లపూడి, కృష్ణా బ్రిడ్జి మీదుగా వెంకటపాలెం వెళతాయి. ఎన్టీఆర్ జిల్లా నుంచి వచ్చే వాహనాలన్నీ కూడా గొల్లపూడి దగ్గర సర్వీసు రోడ్డు ఎక్కి కృష్ణానది బ్రిడ్జి మీదుగా వెంకటపాలెం చేరుకొని అక్కడ నుంచి సభాస్థలి సమీపంలో ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్లేస్‌కు చేరుకుంటాయి. కృష్ణా బ్రిడ్జిని సిద్ధం చేయటం కోసం శరవేగంగా బీటీ లేయరు పనులు పూర్తి చేశారు. మొత్తం మూడు కిలోమీటర్ల పొడవున కృష్ణా బ్రిడ్జి ఉంటుంది. సభకు వచ్చే ప్రజలంతా కృష్ణా బ్రిడ్జి మీద ప్రయాణిస్తూ ఒక వైపు కృష్ణా నది అందాలు, మరోవైపు దూరాన ప్రకాశం బ్యారేజ్, నది మధ్యలో దీవులు ఇవన్నీ వీక్షించుకుంటూ అమరావతి రాజధానిలోకి అడుగు పెట్టవచ్చు. కృష్ణా బ్రిడ్జి ఇంత అత్యద్భుతంగా నిర్మించారన్నది ఇప్పటి వరకు ప్రజలకు పెద్దగా తెలియదు. అమరావతి సభ పుణ్యమా అని ప్రజలంతా కృష్ణాబ్రిడ్జి గురించి తెలుసుకునే అవకాశం ఏర్పడింది. రాజమార్గాలుగా పై రెండు మారనున్నాయి.

విధ్వంసం నుంచి పునర్వికాసం

(5వ పేజీ తరువాయి)

ప్రపంచ బ్యాంకు, ఏడీబీల నుంచి, రూ.11 వేల కోట్లను హడ్కో నుంచి, మరో రూ.5 వేల కోట్లను కేఎఫ్‌డబ్ల్యూ వంటి సంస్థల నుంచి అప్పుగా తీసుకోవటానికి మార్గమేర్పడింది. అక్కడి నుంచి అమరావతి పునర్నిర్మాణ పనుల దిశగా రాజధానిలో అడుగులు పడ్డాయి. అడవిగా మారిన అమరావతిని పూర్వస్థితికి తీసుకురావడం, ఐకానిక్ కట్టడాల బేస్‌మెంట్‌లో ఉన్న నీటిని తోడేయడం వంటివి చేయడంతో పాటు సమాంతరంగా టెండర్ల ప్రక్రియను నిర్వహించి వాటిని ఖరారు చేసి ఎల్వోఏలను ఇచ్చారు. టెండర్లు దక్కించుకున్న సంస్థలు చాలావరకు పనుల ప్రారంభానికి సిద్ధమయ్యాయి.

అమరావతి రూపురేఖలను మార్చేలా..

అమరావతికి మళ్లీ ఊపిరిలూదటంతో పాటు రూపురేఖలను మార్చేసేలా భారీ మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మౌలిక సదుపాయాల కల్పనకు రూ.77,250 కోట్లతో పనులు నిర్దేశించారు. ఇవికాకుండా మరో రూ.30 వేల కోట్లకు సంబంధించిన పనులు, అనుబంధ పనులను నిర్దేశించుకున్నారు. రూ.49 వేల కోట్ల పనులకు సంబంధించి టెండర్లు పిలిచారు. గృహ, భవన నిర్మాణ పనులకు సంబంధించి రూ.12,700 కోట్లతో టెండర్లు ఆహ్వానించారు. ఐకానిక్ బిల్డింగ్స్ కేటగిరీలో సచివాలయ టవర్లు, అసెంబ్లీ, హైకోర్టు భవనాలతో పాటు ప్రజాప్రతినిధులు, అఖిల భారతస్థాయి అధికారుల భవనాలు ఉన్నాయి. రాజధానిలో కీలకమైన ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం రూ.16,200 కోట్లతో టెండర్లు పిలిచారు. ఇందులో ఆర్టీరియల్ రోడ్లు, సబ్ ఆర్టీరియల్ రోడ్లు, ఫ్లడ్ మిటిగేషన్ పనులు ఉన్నాయి. ఎల్‌పీఎస్ ఇన్ఫ్రా కింద రూ.20,100 కోట్లతో పనులకు టెండర్లు పిలిచారు. రైతులకు ఇవ్వాల్సిన లే అవుట్లలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, అండర్‌గ్రౌండ్ యుటిలిటీ నెట్‌వర్క్ వంటి అనేక పనులు వీటిలోనే ఉంటాయి.



శిలాఫలకాలు శుభ్రం చేస్తున్న కార్మికురాలు

ఇప్పటివరకు రూ.26 వేల కోట్ల సమీకరణ

రాజధాని నిర్మాణ పనులకు సంబంధించి ఇప్పటివరకు రూ.26 వేల కోట్ల మేర సమీకరించారు. ప్రపంచ బ్యాంకు నుంచి రూ.15 వేల కోట్లు రుణం మంజూరైంది. హడ్కో కూడా రూ.11 వేల కోట్లు ఇచ్చింది. కేఎఫ్‌డబ్ల్యూ నుంచి రూ.5 వేల కోట్ల రుణం మంజూరు కావాల్సి ఉంది. ఇప్పటికే టెండర్లు పిలిచిన వాటికి, పిలవాల్సిన వాటికి సంబంధించి ఇంకా రూ.74 వేల కోట్ల నిధులు కావాల్సిన అవసరం ఉంది. కేఎఫ్‌డబ్ల్యూ నుంచి రూ.5 వేల కోట్లు వస్తే మరో రూ.69 వేల కోట్లు అవసరమవుతాయి. ఈ నిధుల కోసం డొమెస్టిక్ అండ్ ఇంటర్నేషనల్ బాండ్ మార్కెట్ ద్వారా, మల్టీలేటరల్ ఏజెన్సీలు, బ్యాంకుల ద్వారా, కేంద్ర ప్రభుత్వ సాయం, పబ్లిక్ అండ్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ), భూ విక్రయాలు (ల్యాండ్ మానిటైజేషన్) వంటి మార్గాల ద్వారా సీఆర్‌డీఏ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

గన్నవరంలో గరంగరం

(5వ పేజీ తరువాయి)

ఇంకోసారి ఇలా జరిగితే ఊరుకునేది లేదని ఆమె మండిపడ్డారు. తనను ఎందుకు హౌస్ అరెస్టు చేశారో సమాధానం చెప్పాలని, ఓ పార్టీ అధ్యక్షురాలిపై జులుం ఏమిటని సీఎం చంద్రబాబు, హోంమంత్రి సమాధానం చెప్పాలన్నారు. అమరావతిపై రీసెర్చ్ చేయాలని అనుకోవడంలో తప్పేంటని, రాజధాని నిర్మాణంపై కమిటీ వేశామన్నారు. కమిటీ చూడటానికి వెళ్తుంటే, ఎందుకంత భయమని, తమ పార్టీ కార్యాలయానికి వెళ్లి చర్చించాలనుకున్నామని ఆమె పేర్కొన్నారు. ఇంతలోనే హౌస్ అరెస్ట్ చేయటం సరైన వైఖరి కాదని మండిపడ్డారు. ఇదేనా కూటమి వైఖరి అని ప్రశ్నించారు. పోలీసులు మహిళలను రక్షించడంపై దృష్టి పెట్టాలని, హక్కులను కాలరాస్తే చూస్తూ ఊరుకోబోమని అన్నారు. అనంతరం ఆమె విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి వెళ్లారు. గుంటూరు మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ధనేకుల మురళీమోహన్, కొలనుకొండ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

మినుము రైతుకు ధరాఘాతం

(5వ పేజీ తరువాయి)

రూ.100 తగ్గుతుందని స్థానిక వ్యాపారులు సూచనప్రాయంగా చెబుతున్నారు. మినుము కొనుగోలు చేసే తెనాలి, గుంటూరుకు చెందిన బడా వ్యాపారులు కూడబలుక్కుని ధరను ఏరోజు ఎంతమేర నిర్ణయిస్తున్నారో స్పష్టత ఉండట్లేదని, దీంతో తాము నష్టపోయే ప్రమాదం ఉందని స్థానిక వ్యాపారులు పేర్కొంటున్నారు.

ప్రాంతాలవారీగా ధరల్లో వ్యత్యాసం

జిల్లాలో రకరకాల ధరలు నిర్ణయించి మినుము కొంటున్నారు. మచిలీపట్నం, గుడివాడ, గన్నవరంలో క్వింటాకు మద్దతు ధరగా రూ.6,800 మాత్రమే వ్యాపారులు ఇస్తున్నారు. పెడన పరిసర ప్రాంతాల్లో రూ.6,900కు కొంటున్నారు. మినుములో నాణ్యత లోపించిందనే కారణంతో ధరలో రూ.100 కోతపడుతోందని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు. జిల్లాలోని 28 ప్రాంతాల్లో మినుము కొనుగోలు కేంద్రాలను మార్చిలో ఏర్పాటు చేశారు. మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల నుంచి మినుము కొంటామని అధికారులు ప్రకటించారు. మినుము క్వింటాకు మద్దతు ధరగా రూ.7,400 ప్రభుత్వం ప్రకటించిందని, మినుమును విక్రయించాలంటే ముందస్తుగా ఆర్‌ఎస్‌కేలలో రైతులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటున్నారు. ఇప్పటి వరకు కేవలం 12 మంది రైతులు మాత్రమే మినుము విక్రయించేందుకు తమపేర్లను ఆర్‌ఎస్‌కేలలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. మే తర్వాత మినుము ధరలు పెరుగుతాయనే ఆశతో రైతులు ఉన్నారు. పెద్దవ్యాపారులు కూడబలుక్కుని ధరలను జూన్‌లో కూడా పెంచకపోతే తమ పరిస్థితి ఏమిటనే అంశంపై వారు ఆందోళన చెందుతున్నారు. జూన్‌లో వరిసాగు ప్రారంభమవుతుందని, మినుము విక్రయించిన సొమ్మును ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడిగా పెట్టాలనే ఆలోచనలో ఉన్నామని అంటున్నారు. మినుము ధర తగ్గడంతో గతేడాదితో పోలిస్తే ఎకరాకు కనీసం రూ.10వేలకుపైగా నష్టపోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

రేపే వేడుక

(5వ పేజీ తరువాయి)

పాటు న్యాయమూర్తుల నివాస సముదాయాలు, ఎమ్మెల్యేలు, మంత్రుల గృహ సముదాయాలు, ఆలిండియా సర్వీసెస్ అధికారుల బహుళ అంతస్తుల భవన సముదాయాల నిర్మాణాలకు ప్రధాని శంకుస్థాపన చేస్తారు.

- కీలకమైన కేంద్ర ప్రాజెక్టులకు కూడా ఇదే వేదికగా ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. భారత రక్షణ రంగ పరిశోధనా సంస్థ (డీఆర్‌డీవో), డీపీఐఐటీ, ఎన్‌హెచ్ఏఐ, రైల్వే శాఖలకు సంబంధించిన ప్రాజెక్టులకు శంకుస్థాపన ఏర్పాట్లు చేశారు. వీటి నిర్మాణానికి రూ.57,962 కోట్లు ఖర్చు చేస్తారు. నాగాయలంకలోని గుల్లలమోద దగ్గర రూ.1,500 కోట్లతో మిస్సైల్ టెస్ట్ రేంజ్ సెంటర్ నిర్మాణానికి వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారు. విశాఖలో కేంద్ర ప్రభుత్వం నిర్మించే యూనిటీ మాల్‌కు కూడా శంకుస్థాపన చేస్తారు. అలాగే, రూ.293 కోట్ల వ్యయంతో గుంతకల్లు వెస్ట్ నుంచి మల్లప్పగేటు వరకు చేపట్టిన రైల్వే ప్రాజెక్టుకు, రూ.3,176 కోట్లతో నేషనల్ హైవే ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేస్తారు. రూ.3,680 కోట్ల విలువైన పలు నేషనల్ హైవే పనులను ప్రారంభిస్తారు. రూ.254 కోట్లతో పూర్తిచేసిన ఖాజీపేట-విజయవాడ 3వ లైన్‌ను, గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్ ప్రాజెక్టులో బుగ్గనపల్లి, పాణ్యం రైల్వేలైన్లకు కూడా మోదీ ప్రారంభిస్తారు.

భేషుగ్గా భోజనాలు

సభికులకు తెలుగు సంప్రదాయ భోజనాలు అందించనున్నారు. భోజన ఏర్పాట్ల బాధ్యతను ఎన్టీఆర్, గుంటూరు జిల్లా యంత్రాంగాలకు అప్పగించారు. గ్యాలరీలో ప్రజల దగ్గరికే భోజనాలు, స్నాక్స్, మంచినీరు, మజ్జిగ వంటివి అందిస్తారు.

ఏర్పాట్లు దాదాపు పూర్తి

(5వ పేజీ తరువాయి)

ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులను సూచించినట్లు చెప్పారు. సభకు వచ్చేవారి కోసం 3వేల బస్సులు, 1,000 కార్ల పార్కింగ్ కోసం ముందస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 5 లక్షల మందికి జనాభా వచ్చే అవకాశం ఉండటంతో మరికొన్ని చోట్ల పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సుమారు 6,500-7వేల బస్సులు, 3 వేల కార్లు పార్కింగ్ చేయడానికి వీలుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రొటోకాల్ ప్రకారం అందరికీ ఆహ్వానం పలుకుతున్నామని, అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు వెళ్తున్నాయని ఆయన తెలిపారు. అనంతరం మంత్రి సభావేదిక, ప్రాంగణాన్ని పరిశీలించారు.

ఎంఎస్‌ఎంఈకి 10 ఎకరాలు

(5వ పేజీ తరువాయి)

పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, కలెక్టర్ బాలాజీ చర్చలు జరుపుతున్నారు.

40 ఏళ్లుగా ఖాళీగానే..

పామర్రుకు చెందిన బొప్పన ఇంటిపేరు కలిగిన కుటుంబ సభ్యులకు చెందిన ఈ భూములు 40 ఏళ్లుగా మిగులు భూముల కోటాలో ఉన్నాయి. బొప్పన కుటుంబానికి చెందిన వారసులు ఈ భూములు తమకే చెందుతాయని కోర్టును ఆశ్రయించారు. కోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు చెప్పింది. అయితే, ఇటీవల కాలం వరకు వీటిని స్వాధీనం చేసుకోలేదు. దీంతో పదేళ్లుగా కోనేరు రంగారావు కమిటీ సిఫార్సుల మేరకు ఈ భూములను ఐనంపూడి గ్రామానికి చెందిన పేదలకు పంచాలని వామపక్ష నాయకులు ఉద్యమాలు చేశారు. 2019కు పూర్వం ఈ భూముల్లో కొందరు పేదలు వరి సాగు కూడా చేశారు. అయితే, 2019 తర్వాత ఈ భూముల్లోకి పేదలు వెళ్లకుండా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు నిర్ణయం తీసుకుంటామని, అప్పటివరకు ఈ భూముల్లోకి ఎవరూ వెళ్లొద్దని ఆంక్షలు విధించారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఈ మిగులు భూములను పరిశ్రమల స్థాపనకు కేటాయించేందుకు రంగం సిద్ధం చేసింది. ఇక్కడ ఎకరం రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షలకు పైగా ధర పలుకుతోంది.

జిల్లాలో ట్రాఫిక్ మళ్లింపు

- ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో అధికారుల నిర్ణయం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ గంగాధరరావు

మచిలీపట్నం, ఏప్రిల్30 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ 2వ తేదీన వస్తున్న నేపథ్యంలో గురువారం రాత్రి 10 గంటల నుంచి శుక్రవారం రాత్రి 10 గంటల వరకు జిల్లాలోకి వివిధ మార్గాల ద్వారా వచ్చే వాహనాల రాకపోకలను మళ్లిస్తున్నట్లు ఎస్పీ ఆర్.గంగాధరరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

- కాకినాడ జల్లా నుంచి విశాఖపట్నం-చెన్నై వెళ్లే వాహనాలు కత్తిపూడి సెంటర్, కాకినాడ, యానాం, అమలాపురం, రాజోలు, నరసాపురం, మచిలీపట్నం, రేపల్లె, బాపట్ల మీదుగా ఒంగోలు వెళ్తాయి.
- గుంటూరు జిల్లా మీదుగా చెన్నై నుంచి విశాఖపట్నం వెళ్లే వాహనాలు బడంపాడు క్రాస్‌రోడ్, తెనాలి, పులిగడ్డ, మచిలీపట్నం, లోసరిబ్రిడ్జి, నరసాపురం, అమలాపురం, కాకినాడ, కత్తిపూడి మీదుగా వెళ్తాయి.
- తూర్పు గోదావరి జిల్లా నుంచి విశాఖపట్నం-హైదరాబాద్ వెళ్లే వాహనాలు. దివాన్ చెరువు, గమాన్‌బ్రిడ్జి, దేవరపల్లి, గోపాలపురం, జంగారెడ్డిగూడెం, అశ్వారావుపేట, సత్తుపల్లి, ఖమ్మం, సూర్యాపేట మీదుగా ప్రయాణిస్తాయి.
- ఏలూరు జిల్లా మీదుగా విశాఖపట్నం-హైదరాబాద్ వెళ్లే వాహనాలు భీమడోలు, ద్వారకాతిరుమల, కామవరపుకోట, చింతలపూడి, ఖమ్మం మీదుగా హైదరాబాద్ వెళ్తాయి. ఏలూరు బైపాస్, జంగారెడ్డిగూడెం, అశ్వరావుపేట, ఖమ్మం మీదుగా హైదరాబాద్‌కు ప్రయాణిస్తాయి.
- విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు కృష్ణాజిల్లా మీదుగా వెళ్లే వాహనాలు హనుమాన్‌జంక్షన్, నూజివీడు, మైలవరం, ఇబ్రహీంపట్నం, నందిగామ మీదుగా వెళ్తాయి.
- ఎన్టీఆర్ జిల్లా మీదుగా హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే వాహనాలు నందిగామ, మధిర, వైరా, సత్తుపల్లి, అశ్వారావుపేట, జంగారెడ్డిగూడెం, దేవరపల్లి, గామన్ బ్రిడ్జి మీదుగా వెళ్తాయి. మరికొన్ని వాహనాలు ఇబ్రహీంపట్నం, మైలవరం, నూజివీడు, హనుమాన్‌జంక్షన్, ఏలూరు మీదుగా ప్రయాణిస్తాయి.
- విజయవాడ ఎయిర్‌పోర్టుకు వచ్చే వాహనాలు రామవరప్పాడు ఫ్లైఓవర్, ఆంధ్రజ్యోతి కార్యాలయం, ముస్తాబాద, సూరంపల్లి అండర్‌పాస్ ద్వారా గన్నవరం చైతన్యస్కూల్ వద్ద జాతీయ రహదారి 16పైకి వచ్చి ఎయిర్ పోర్టుకు వెళ్తాయి.

పెరుగుతున్న ట్రాఫిక్‌తో నిత్యం ప్రమాదాలు

- నివారించాలని హైవే అధికారులకు ఎమ్మెల్యే యార్లగడ్డ వినతి



హైవే పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

విజయవాడ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రోజురోజుకూ ట్రాఫిక్ పెరుగుతుండడంతో 4 రోడ్ల కూడళ్ల వద్ద నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వాటిని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నేషనల్ హైవే అథారిటీ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. నిత్యం అనేకమంది ఈ కూడలి వద్ద ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం హైవే అధికారులతో మాట్లాడుతూ మండలంలోని కేసరపల్లి, గాంధీబొమ్మ సెంటర్, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో నిత్యం ప్రజలు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని, రాత్రిపూట సరైన వెలుతురు లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిబంధనల మేరకు రద్దీగా మారిన ప్రాంతాలను గుర్తించి వెంటనే చర్యలు చేపట్టి సిగ్నల్ వ్యవస్థను పటిష్టం చేయాలని కోరారు. పనిచేయని విద్యుత్ దీపాలను పునరుద్ధరించి సైన్‌బోర్డులను ఏర్పాటు చేయాలని కోరారు. పాదచారుల కోసం రోడ్డుకిరువైపులా ఫుట్‌పాత్ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. మార్గమధ్యలో హైవేపై జరుగుతున్న పనులు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 440

ఉద్యోగాలకు 118 మంది ఎంపిక

ఉయ్యూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్ మెంట్ సెల్ ఆధ్వర్యంలో బుధవారం కళాశాల ఆవరణలో నిర్వహించిన జాబ్ మేళాలో వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు 118 మంది విద్యార్థులు ఎంపికైనట్టు ఉపాధి శిక్షణ అధికారి సీహెచ్ అనీల్‌కుమార్ తెలిపారు. జాబ్ మేళాకు 207మంది హాజరు కాగా అందులో 118 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ శివనాథ్ తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.నరేశ్ కుమార్, టి. మధు, జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



జాబ్‌మేళాకు హాజరైన విద్యార్థులు



ఏసీని బహూకరిస్తున్న దాత నాగేశ్వరరావు

చోడవరం సచివాలయానికి ఏసీ బహూకరణ

పెనమలూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : దివంగత మన్నే సుందరరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు నాగేశ్వరరావు బుధవారం చోడవరం సచివాలయానికి ఒక ఏసీ బహూకరించారు. ఆయనను గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు కలపాల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



జంక్షన్‌లో శాంతియాత్ర నిర్వహిస్తున్న బైబిల్ పాఠశాల విద్యార్థులు

జంక్షన్‌లో శాంతియాత్ర

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గుడివాడ రోడ్డు ఇందిరానగర్ బేతేలు ప్రార్థన మందిరం విద్యార్థులు జంక్షన్‌లో శాంతియాత్ర నిర్వహించారు. మందిరంలో ఈ నెల 24 నుంచి విద్యార్థులకు నిర్వహించిన విరామ బైబిల్ పాఠశాల ముగింపు సందర్భంగా బుధవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ప్రార్థన మందిరం నుంచి ప్రారంభమై రంగా విగ్రహం మీదుగా జంక్షన్ ప్రధాన రహదారుల్లో శాంతియాత్ర నిర్వహించారు. తల్లిదండ్రులు పట్ల, సమాజం పట్ల విధేయతతో ఉంటూ సన్మార్గంలో నడుచుకోవాలని ర్యాలీని ఉద్దేశించి పాస్టర్ ప్రసన్నకుమార్ ప్రసంగించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు ప్రకాష్, సత్యనారాయణ, జోసెఫ్, సాంబయ్య, కరుణాకర్, నతానియేల్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ స్టడీ క్లాసులు ప్రారంభం

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : పదోతరగతి సప్లమెంటరీ పరీక్షల్లో విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా స్టడీ క్లాసులు సాగించాలని బాపులపాడు ఎంఈవో రాంబాలసింగ్ ఉపాధ్యాయులను ఆదేశించారు. పదో తరగతి పరీక్షల్లో తప్పిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బుధవారం నుంచి స్టడీ తరగతులు ప్రారంభించారు. అందులో భాగంగా బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తు న్న స్టడీ క్లాసులను ఎంఈవో పరిశీలించారు.



శంకుస్థాపన కార్యక్రమంలో సర్పంచ్ అనిత

అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): స్వేచ్ఛ, సౌభ్రాతృత్వంతో కూడిన వ్యవస్థీకృతం ద్వారా మాత్రమే అభివృద్ధి సాధ్యమని చెప్పిన మహనీయుడు అంబేడ్కర్ అని సర్పంచ్ పిల్లా అనిత అన్నారు. వీరవల్లి సీఎస్‌ఐ చర్చి వద్ద అంబే డ్కర్ విగ్రహ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గుండపనేని ఉమా వరప్రసాద్, ఉప సర్పంచ్ లంక అజయ్‌కుమార్, కలపాల రాజాబాబు, మాలమహానాడు నాయకుడు బేతాళ శరత్‌బాబు, మాజీ సర్పంచ్ నందమూరి మురళీకృష్ణప్రసాద్, పిల్లా రామారావు, సుందరం మాస్టార్, వెలగపల్లి వెంకటేశ్వరరావు, ఇలపర్తి సుధాకర్, వన్నెకూటి నరేష్, ధర్మేంద్ర, సిలువరాజు, ఎడ్విన్ పాల్గొన్నారు.

వేసవి శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

ఉయ్యూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాల్లో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొని విద్యార్థులు విజ్ఞానం పెంపొందిచుకోవాలని రిసోర్స్ పర్సన్ బిగోపాలకృష్ణ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆయన పాల్గొని విద్యార్థులకు చెస్, క్యారమ్స్ ఆటలు నేర్పించారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : గ్రంథాలయాల్లో మహనీయుల జీవితచరిత్రలను చదవడం జీవితానికి స్ఫూర్తిదాయకమని గ్రంథాలయాధికారి పి.స్వర్ణలతాదేవి విద్యార్థులకు సూచించారు. వీరవల్లి, కానుమోలు గ్రంథాలయాల్లో బుధవారం వేసవి శిక్షణా కార్యక్రమంలో భాగంగా గ్రంథ పఠనంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కానుమోలు గ్రంథాలయాధికారి జె. సుబ్రహ్మణ్యేశ్వరరావు పర్యవేక్షణలో విద్యార్థులకు చెస్, క్యారమ్స్ లాంటి ఆటల పోటీలతో పాటు పుస్తక సమీక్ష నిర్వహించారు.

ఉంగుటూరు : విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి గ్రంథాలయాలు ఎంతో దోహదపడతాయని, గ్రంథాలయాల సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆత్కూరు, ఉంగుటూరు, తేలప్రోలు, మానికొండ గ్రంథాలయాధికారులు బీవీ కృష్ణారావు, యు.చంద్రశేఖరరావు, బి.శ్రీనివాసరావు, ఎల్.హరికృష్ణ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా బుధవారం మండలంలోని నాలుగు గ్రంథాలయాల్లో విద్యార్థులకు పుస్తక పఠనం ఆవశ్యకత గురించి వివరించారు.

పాడిరైతుల అభ్యున్నతికి కృషి

గోపవరపుగూడెంలో పాలకేంద్ర భవనం ప్రారంభోత్సవంలో కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు



గోపవరపుగూడెంలో పాలకేంద్ర భవనాన్ని ప్రారంభిస్తున్న కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

గన్నవరం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతులతో పాటు పాలకేంద్రాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. మండలంలోని గోపవరపుగూడెంలో రూ.5లక్షలతో నూతనంగా నిర్మించిన పాల కేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే, యూనియన్ జిల్లా డైరెక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావుతో కలసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామాల్లో వ్యవసాయం తరువాత పాడిపరిశ్రమ రైతులకు, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పిస్తుందన్నారు. మేలుజాతి పశువుల పోషణ ద్వారా పాల ఉత్పత్తిని పెంచవచ్చన్నారు. పాలు పెరిగితే ఆదాయం పెరుగుతుందన్నారు. పాడి రైతులకు కృష్ణామిల్క్ యూనియన్ ద్వారా గతేడాది లక్షల రూపాయలు బోనస్ అందిస్తున్నట్లు చెప్పారు. ఈ గ్రామంలోనే రూ.8లక్షలు ఇచ్చినట్లు చెప్పారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పాడి రైతుల కుటుంబాలకు మేలు జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. రైతులు పశుపోషణపై మరింత ఆసక్తి పెంచుకోవాలన్నారు. జిల్లా డైరెక్టర్ డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావు మాట్లాడుతూ, గ్రామాల్లో పాల కేంద్రాలు సొంత భవనాలను అందుబాటులోకి తెచ్చుకోవటం ద్వారా బలోపేతం కావడానికి అవకాశం ఉంటుందన్నారు. రూ.5లక్షలతో భవనాన్ని నిర్మించుకోవటం అభినందనీయమన్నారు. పాడిరైతుల జీవితాల్లో మార్పు కోసం యూనియన్ నిరంతరం పాటు పడుతుందని చెప్పారు. జిల్లా డైరెక్టర్ పలగాని కొండలరావు, రూట్ మేనేజర్ తుమ్మల యశ్వంత్, పాలకేంద్రం అధ్యక్షుడు నల్లూరు వెంకట శివ ప్రసాద్, డైరెక్టర్లు చిట్టినేని కోటేశ్వరరావు, తరిగొప్పల శ్రీనివాసరావు, బి.తేరేజిరాజు, పసుపులేటి సుబ్బారావు, సూపర్‌వైజర్ వీరాంజనేయులు, కొండపావులూరు పాలకేంద్రం అధ్యక్షుడు మిరియాల స్వామి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు

విద్యార్థుల్లోని సామర్థ్యాన్ని వెలికితీయాలి

పెనమలూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థిలో వివిధ రంగాల పట్ల తెలలియని సామర్థ్యం దాగి ఉంటుందని, అలాంటి సామర్థ్యం ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారు ఉన్నత స్థానాలకు చేరేందుకు తమ వంతు సహకారం, అందించడమే తమ బాధ్యతని పెనమలూరు ఉన్నత పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కిలారు శివకుమార్ పేర్కొన్నారు. బుధవారం పెనమలూరు ఉన్నత పాఠశాలలో గత రెండు రోజులుగా జరుగుతున్న అటల్ బూట్ క్యాంపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం దుర్గాభవాని, డిప్యూటీ ఈవో ఐ పద్మారాణి, విజయవాడ నీడ్స్ యూ సమన్వయకర్త కిలారు నాగశ్రవణ్, ఎంఈవో శేషగిరిరావు, యూనిసెఫ్ ప్రతినిధి సుదర్శన్, మాధవిలత, అభివృద్ధి కమిటీ కార్యదర్శి కిలారు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● మామిడి పండ్లు, మజ్జిగ పంపిణీ



ప్రజాసేవే లక్ష్యంగా పోరంకి గ్రామానికి చెందిన శారద క్యాటరింగ్ అధినేత కర్లపూడి సుబ్బారావు అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. బుధవారం పోరంకి సెంటర్‌లో చలివేంద్రం ఏర్పాటుతో పాటు పాదచారులకు, ప్రయాణికులకు మామిడిపండ్లు, మజ్జిగ, పంపిణీ చేశారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని మరింత మంది తమకు తోచిన విధంగా వేసవిలో పేద ప్రజలకు సేవలందించాలని పలువురు కోరుతున్నారు. - పెనమలూరు

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కల్పించాలి

ఉయ్యూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో బాల్యవివాహాలు వల్ల కలిగే అనర్థాలపై గ్రామాలలో విస్తృతంగా ప్రచారం చేసి అవగాహన కల్పించాలని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం కంకిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కిశోర వికాసం శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని, వారిలో జీవన నైపుణ్యాలను మెరుగుపరచే దిశగా తగిన శిక్షణ ఇవ్వాల న్నారు. బాలికల విద్య వారి జీవితానికి ఒక మలుపు అని వ్యక్తి గత పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని ఏపీఎం అమరేశ్వరరావు అన్నారు. లైంగిక వేధింపుల నుంచి ఎలా రక్షించుకోవాలి, ఆత్మరక్షణ, మానవ అక్రమ రవాణ తదితర అంశాలపై శిక్షణలో అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేబీసరోజిని అన్నారు. ఎంఎస్‌కేలు, ఏఎన్‌ఎంలు, వీఓఏలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పెద అవుటపల్లిలో ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న వ్యవసాయకార్మిక సంఘం జిల్లా సహాయకార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు

ఉపాధి బకాయిలు వెంటనే చెల్లించాలి

ఉంగుటూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో వున్న ఉపాధికూలీల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పెదఅవుటపల్లిలో ఉపాధి పనులు జరిగే ప్రదేశాన్ని స్థానిక సీఐటీయూ నాయకుడు కడవకొల్లు సీతారామరాజుతో కలిసి ఆయన సందర్శించారు. అక్కడ ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 15రోజులకు ఒకసారి చెల్లించాల్సిన వేతన బకాయిలు నెలల తరబడి పెండింగ్‌లో వుంచడంతో ఇల్లు గడవడం కష్టంగా వుందని, పని ఒకచోట, ఫోటో ఐరిష్‌లు మరోచోట పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని కూలీలు తమ బాధను వెంకటేశ్వరరావుకు వివరించారు. ఉపాధి నిధులు వేరే పథకాలకు మళ్లించరాదని, సత్వరమే వేతన బకాయిలు విడుదల చేయాలని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మే 5న ఎంపీడీవో కార్యాలయం ఎదుట జరిగే ధర్నాలో మండలంలోని ఉపాధి కూలీలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అమరావతి సభను విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే సుజనా చౌదరి



కూటమి నేతలతో చర్చిస్తున్న ఎమ్మెల్యే సుజనాచౌదరి

పెనమలూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పునర్నిర్మాణం కోసం మే 2న శంకుస్థాపన చేయడానికి వస్తున్న ప్రధాని మోడీ సభను విజయవంతం చేయాలని విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనాచౌదరి ఎన్డీయే కూటమి నేతలకు పిలుపునిచ్చారు. బుధవారం తాడిగడపలోని తన క్యాంపు కార్యాలయంలో ఎన్డీయే కూటమి నేతలతో సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ఏపీ ప్రభుత్వం ఇప్పటికే విస్తృత ఏర్పాట్లు చేసిందని, నవ్యాంధ్ర కలల రాజధాని అమరావతి పునర్నిర్మాణం కోసం అంతా సిద్ధమైయిందని పేర్కొన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలందరూ ఐక్యంగా ప్రధాని సభను ముందుండి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్టీఆ ర్ జిల్లా జనసేన అధ్యక్షులు సామినేని ఉదయభాను, బీజేపీ అధ్యక్షులు అడ్డూరి శ్రీరాం, టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్ మీరా, ఎంఎస్ బేగ్, బొమ్మసాని సుబ్బారావు, కోగంటి రామారావు పాల్గొన్నారు.

అమరావతికి తరలి రావాలి

ఉయ్యూరు : అమరావతిలో రాజధాని పునర్నిర్మాణ వేడుకకు తరలిరావాలని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. అమరావతిలో రాజధాని పునర్నిర్మాణ వేడుక కల్పిస్తూ బుధవారం స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఏఎస్‌ఎంలు, ఆశావర్కర్లతో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, శుక్రవారం అమరావతిలో జరిగే పునర్నిర్మాణ కార్యక్రమానికి దేశ ప్రధాని నరేంద్రమోదీ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని ఈ వేడుకలో ప్రజలు పాల్గొనేందుకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు.

పీఎం సభకు తరలిరావాలి

ఉంగుటూరు : రాజధాని పునర్నిర్మాణ పనులు ప్రారంభం సందర్భంగా అమరావతిలో నిర్వహించనున్న పీఎం నరేంద్రమోదీ బహిరంగ సభకు మండలం నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి రావాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి పిలుపు నిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మే 2న అమరావతికి రానున్న నేపథ్యంలో బుధవారం ఉంగుటూరు మండలంలోని మానికొండ, వేంపాడు, నందమూరు గ్రామాల్లో పార్టీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. జనసమీకరణకు చేపట్టాల్సిన చర్యలపై కూటమి నాయకులు, కార్యకర్తలకు ఆయన దిశానిర్దేశం చేశారు. స్థానిక ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మండలానికి 35 బస్సులు కేటాయించారన్నారు. ఈ సమావేశాల్లో ఆయా గ్రామాల కూటమి నాయకులు ఆరికట్ల రవికుమార్, నర్ని వెంకటేశ్వరరావు, బెజవాడ నాగేశ్వరరావు, బడుగు కిషోర్‌బాబు, యెండూరి రమేష్, వీరంకి గోవర్ధన్, కొలుసు రవీంద్ర, నాగనబోయిన శివనాగబాబు (వేంపాడు సర్పంచ్), నాగనబోయిన శ్రీనివాసరావు, మేకల కోటేశ్వరరావు, మండవ ప్రసాద్, రాజశేఖర్, బెజవాడ కృష్ణమూర్తి, సుంకర శ్రీను, అంగన్వాడీ, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



మానికొండలో కూటమి నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న వెంకటకృష్ణారెడ్డి



ఉయ్యూరులో అమరావతిలో రాజధాని పునర్నిర్మాణ వేడుక అవగాహన ర్యాలీ



అభివృద్ధి చేసిన రహదారులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

గోసాల (కంకిపాడు), ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పెనమలూరు మండలంలో రూ. 82.50 లక్షలతో అభివృద్ధి చేసిన రహదా రులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లు ఒక్క రోడ్డు అయినా అభివద్ధి చేశారా అని ప్రశ్నించారు. దోచుకోవడం, దాచుకోవడం మినహా చేసిందేమీ లేదని ఆరోపించారు. ఏడాది క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రూ. 4500 కోట్లతో రహదారులు, డ్రెయినేజీలు అభివృద్ధి చేసి చూపించామన్నారు. ఒక్క పెనమలూరు నియోజకవర్గంలోనే ఈ ఏడాది కాలంలో సుమారు 70 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసి చూపించామన్నారు. రానున్న మరో నెల రోజుల్లో సుమారు రూ. 25 కోట్లతో మూడు మండలాల్లో మిగిలి ఉన్న రోడ్లు, డ్రెయిన్ల అభివృద్ధికి ప్రణాళిక రూపొం దించాలని ఆయా శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులకు సూచించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంగెపు శ్రీనివాసరావు, కోనేరు కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, మాబు సుబాని, కోనేరు సాంబశివరావు, సంగెపు రంగారావు, ఎందువ రాంబాబు, డీఈ శ్రీనివాసరావు, ఏఈ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు

ఉయ్యూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించి గ్రామ సచివాలయంలోకి వచ్చి ఉద్యోగులతో వాగ్వావాదానికి దిగిన వ్యక్తిని వారించిన గ్రామ సర్పంచ్‌పై దాడిచేసి గాయపరచిన వ్యక్తిపై ఉయ్యూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై కె.సురేశ్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. కలవపాములకు చెందిన కె.సతీశ్ సచివాలయానికి వచ్చి ఆధార్ కార్డులో తన భార్య ఇంటిపేరు మార్చాలని డిజిటల్ అసిస్టెంట్ యు.నాగ బాబును అడిగాడు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి వివాహధ్రువీకరణ పత్రం తీసుకురావాలని నాగబాబు సూచించగా, సతీశ్ వాగ్వివాదానికి దిగగా కార్యదర్శి సాయిబాబు సర్పంచ్ పి.బాలస్వామికి సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడకు చేరుకున్న సర్పంచ్ సతీశ్‌కు సర్దిచెప్పి బయటకు పంపిం చారు. కొద్దిసేపటికి మళ్లీ తిరిగివచ్చిన సతీశ్ సర్పంచ్‌తో ఘర్షణకు దిగి దాడిచేసి గాయపరిచాడు.

కల్యాణం.. కమనీయం



నీటి పారుదల శాఖ మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత దేవినేని ఉమామహేశ్వరరావు కుమారుడు నిహార్, సాయి నర్మద వివాహం బుధవారం కంకిపాడులోని అయాన కన్వెన్షన్ సెంటర్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వివాహానికి తెలుగు రాష్ట్రాల ప్రముఖులు ఎంతోమంది విచ్చేసి వధూవరులను ఆశీర్వదించారు. అలాగే ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నేతలు పాల్గొన్నారు. మంత్రులు కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, ఉమ్మడి జిల్లాకు చెందిన పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి, కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, బోడె ప్రసాద్, గద్దె రామ్మోహన్, సుజనా చౌదరి, వసంత కృష్ణప్రసాద్, శ్రీరాం రాజగోపాల్, కొలికపూడి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ తదితరులు హాజరయ్యారు. - కంకిపాడు, ఆంధ్రజ్యోతి

దుర్గగుడిలో ఘనంగా మహాలక్ష్మీయాగం



ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం అక్షయ తృతీయ సందర్భంగా మహాలక్ష్మీయాగాన్ని నిర్వహించారు. మంత్రపూర్వక ఆహుతులను సమర్పించిన అనంతరం అమ్మవారికి వివిధ ఉపాచారాలను నిర్వహించారు. చివరిలో ఘనంగా పూర్ణాహుతి నిర్వహించారు.అక్షయ తృతీయ విశేషాలు, దుర్గగుడిలో జరిగిన హోమం గురించి దేవస్థానం పురాణ పండిట్ చింతపల్లి వెంకటేశ్వర శాస్త్రి వివరించారు. వేద పండితులు, అర్చకులు యాగాన్ని నిర్వహించి భక్తులకు ఆశీస్సులు అందజేశారు.

రేపు శంకర జయంతి, నగరోత్సవం

జగద్గురు ఆదిశంకరుల జయంతి సందర్భంగా దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో మే 2న శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి నూతనంగా నిర్మించిన పూజా మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఈవో కె. రామచంద్ర మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు మహామండపం నుంచి నగరోత్సవం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ నగరోత్సవం మహామండపం, అర్జునవీధి, రథం సెంటర్, కెనాల్ రోడ్డు, వినాయక ఆలయం మీదుగా తిరిగి దేవస్థానానికి చేరుకుంటుందన్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఆర్యవైశ్య కార్పొరేషన్ ప్రతినిధులు

ఆర్యవైశ్యుల అభివృద్ధే చంద్రబాబు లక్ష్యం

● రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

గవర్నర్‌పేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్యవైశ్యుల అభివృద్ధే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్, సంక్షేమ, చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్ సవిత అన్నారు. బుధవారం అమరావతిలోని సచివాలయంలో మంత్రి సవితను రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాజేష్, పలువురు డైరెక్టర్లు కలిశారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ పాలక మండలి తొలి సమావేశంలో పలు సమస్యలపై చర్చించి, వాటిని పరిష్కరించాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్యవైశ్యుల అబివృద్ధికి కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత చంద్రబాబుదేనన్నారు. బడ్జెట్‌లో ఆర్యవైశ్యులకు భారీగా నిధులు కేటాయించారని, పేదలకు ఆర్థిక భరోసా కల్పించడానికి సహకార క్రెడిట్ సొసైటీ ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారని గుర్తు చేశారు.



చైర్మన్‌గా ఎన్నికైన బాషాను అభినందిస్తున్న కమిటీ సభ్యులు

ఏపీ హజ్ కమిటీ చైర్మన్‌గా షేక్ హసన్ బాషా

కలెక్టరేట్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఏపీ హజ్ కమిటీ చైర్మన్‌గా షేక్ హసన్ బాషా ఎన్నికయ్యారు. విజయవాడలోని మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో ఎలక్షన్ ఆఫీసర్ ఎల్.సుధాకర్ అధ్యక్షతన ఎన్నిక ప్రక్రియ జరిగింది. మొత్తం 13 మంది సభ్యులలో 10 మంది సమావేశానికి హాజరయ్యారు. మొదట హజ్ కమిటీ మెంబర్ పఠాన్ ఖాదర్ అలీ ఖాన్‌ను చైర్మన్ అభ్యర్థిగా ప్రతిపాదించగా హజ్ కమిటీ మెంబర్ మీర్జా ఆబిద్ హుస్సేన్ బేగ్ బలపర్చారు. దీనికి మద్దతుగా మిగిలిన సభ్యులందరూ తమ ఆమోదాన్ని తెలిపారు. ఆ మేరకు ఎలక్షన్ ఆఫీసర్ ఎల్.సుధాకరరావు, ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ చైర్మన్‌గా షేక్ హసన్ బాషా ఎన్నికైనట్టు ప్రకటించారు. ఏపీ హజ్ కమిటీ కార్యనిర్వాహణాధికారి ఎస్.ఎండీ గౌస్ పీర్ ఆధ్వర్యంలో జరిగింది.


వ్యాన్ బోల్తా.. పలువురికి గాయాలు

పెనుగంచిప్రోలు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక మునేటి కాజ్ వే అవతల వైపున బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కృష్ణా జిల్లా చల్లపల్లికి చెందిన పలువురు గాయాల పాలయ్యారు. చల్లపల్లికి చెందిన నారికం అయ్యప్ప అనే భక్తుడు తన కుమారుడి అన్న ప్రసానం నిమిత్తం తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానానికి వచ్చారు. భోజనం చేసేందుకు తమ వ్యాన్‌లో మునేటి అవతల వైపునకు వెళుతుండగా అడ్డువచ్చిన ద్విచక్రవాహనాన్ని డ్రైవర్ తప్పించేందుకు సడన్ బ్రేక్ వేయడంతో వ్యాన్ రోడ్డుపై పడిపోయింది. అందులోని ఏడుగురు భక్తులు పరిశా గోవర్ధన, నారగం దుర్గారావు, వక్కలగడ్డ సీతామహాలక్ష్మి, గోపాలకృష్ణ, శివపార్వతి, వెంకట నరసమ్మ, నాగలక్ష్మి గాయాలపాలయ్యారు. ఇద్దరికి బలమైన గాయాలవగా వారికి నందిగామ పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు. ఎస్సై అర్జున ఘటన స్థలానికి చేరుకొని రోడ్డుపై అడ్డుగా ఉన్న వ్యాన్‌ను పక్కకు తీయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

వడదెబ్బకు కార్మికుడి మృతి

కోడూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వడదెబ్బకు కార్మికుడు మృతి చెందిన ఘటన కోడూరు 9వ వార్డులో జరిగింది. ఎస్ఐ చాణక్య తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బలుసుపల్లి వెంకటేశ్వరరావు (54) తాపీ పనిచేస్తూ జీవిస్తుంటాడు. మంగళవారం రాత్రి కోడూరు శివారు వేటపాలెం గ్రామంలో పనికి వెళ్లగా, మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఒక్కసారిగా సొమ్మసిల్లి పడిపోయినట్టు తెలిపారు. వెంటనే తోటి పనివారు వెంకటేశ్వరరావు కుమారుడు శివయ్యకు తెలియజేయగా, అతడు ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడ విశ్రాంతి తీసుకుంటుండగా, ఒక్కసారిగా చెమటలు పట్టి ఊపిరి అందకపోవటంతో అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపినట్టు ఎస్ఐ చెప్పారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

డార్క్ హైవే



ఒకపక్క విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారి. మరోపక్క ఇబ్రహీం పట్నం - చత్తీస్‌గఢ్ 30వ నంబరు జాతీయ రహదారి. ఈ రెండూ ఎంతో ప్రాధాన్యత ఉన్న జాతీయ రహదారులు. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గత పుష్కరాల సమయంలో గొల్లపూడి నుంచి ఇబ్రహీంపట్నం వరకు జాతీయ రహదారి మధ్యలో లైట్లు ఏర్పాటు చేశారు. ఇబ్రహీంపట్నం - చత్తీస్‌గఢ్ జాతీయ రహదారిని జి.కొండూరు వరకు 4 లైన్స్‌గా విస్తరించి, మధ్యలో లైట్లు ఏర్పాటు చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో దేదీప్యమానంగా వెలిగిన లైట్లు వైసీపీ ప్రభుత్వం రాకతో వెలగడం మానేశాయి. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా సమస్య మాత్రం తీరలేదు. గొల్లపూడి నుంచి ఇబ్రహీంపట్నం మధ్య చాలా గ్రామాలున్నాయి. ఇబ్రహీంపట్నం నుంచి జి.కొండూరు వరకు కూడా అంతే. ముఖ్యంగా కొండపల్లి నుంచి జి.కొండూరు మధ్యన అనేక కంపెనీలున్నాయి. వేలసంఖ్యలో వాహనాలు రాత్రిళ్లు తిరుగుతుంటాయి. దీంతో జాతీయ రహదారుల మధ్య వీధి దీపాలు వెలగడం అనివార్యం. ఏళ్ల తరబడి వెలగకపోయినా పట్టించుకునే నాథుడు లేడు. ఇప్పటికైనా హైవే అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

కొండపల్లి ఎర్రబిడ్జ్ వద్ద డేంజర్ బెల్స్

ఇబ్రహీంపట్నం - చత్తీస్‌గఢ్ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కొండపల్లి ఎర్రబిడ్జ్‌ని రైల్వే లైన్ కారణంగా ఎత్తు పెంచారు. దీంతో కొండపల్లి ఊరిలోపలికి వెళ్లే రహదారి పల్లంగాను, జి.కొండూరుకు వెళ్లే రహదారి ఎత్తుగాను ఉంది. కొండపల్లి ఊరిలో నుంచి జాతీయ రహదారిపైకి వచ్చే వాహనాలు ఎత్తైన బ్రిడ్జ్ నుంచి జాతీయ రహదారి మీదకు దిగే వాహనాలు కలిచే చోట్ల వీధి లైట్లు వెలుగక రాత్రి వేళల్లో అంధకారం అలుముకుంది. ఇక్కడ ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని వాహనచోదకులు గుండెలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి.

రాత్రివేళ ఎంతో ఇబ్బంది

ఎం రామారావు, ఆటో డ్రైవర్



లైట్లు వెలగకపోవడంతో రాత్రివేళల్లో వాహనాలు నడపలేక పోతున్నాం. ముందున్న వాహనాలు కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి తక్షణం లైట్లు వెలిగేలా చూడాలి.

రోడ్డు మార్జిన్స్ కనబడుట లేదు

ఎం లక్ష్మణరావు, ద్విచక్రవాహనదారుడు



రాత్రి వేళల్లో రహదారిపై లైట్లు వెలగకపోవడంతో రోడ్డు పక్కనున్న మార్జిన్స్ కనిపించడం లేదు. గొల్లపూడి నుంచి ఇబ్రహీంపట్నం వరకు ఇదే పరిస్థితి. అధికారులు స్పందించి లైట్లు వెలిగేలా చూడాలి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం

వైవీ కృష్ణారావు, విద్యుత్‌శాఖ ఏఈ

లైట్లు వెలగని మాట వాస్తవమే. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం. త్వరలోనే సమస్యను పరిష్కరించి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

తవ్వకాలపై తనిఖీలు

● తవ్వకాల ప్రాంతానికి చేరుకున్న అధికారులు
● ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లను దాచేసిన అక్రమార్కులు
● స్థానికులను ఆరా తీసిన ఆర్డీవో బాలకృష్ణ

నందిగామ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మట్టి మాఫియా ఆగడాలపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. మండలంలోని పెద్దవరం పరిధిలోని ఎంసీ, ఏపీఐఐసీ, అటవీ భూముల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు మట్టి కొల్లగొడుతున్నారు. జన సంచారాన్నే నిషేధించిన అటవీ భూముల్లోకి చొరబడి భారీ యంత్రాలతో విచ్చలవిడిగా తవ్వకాలు జరిపి అమ్ముతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేసిన ఏపీఐఐసీ భూములను, ఎంసీ భూములను సైతం కొల్లగొడుతున్న వైనంపై

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

ఆంధ్రజ్యోతిలో కథనం ప్రసారం కావడంతో అధికారులు హుటాహుటీన ఆ గ్రామానికి చేరుకొని విచారించారు. అధికారుల రాకను తెలుసుకున్న అక్రమార్కులు 2 ఎక్సకవేటర్లు, 9 టిప్పర్లను రోడ్డుపైకి కనపడకుండా అటవీ భూముల్లో దాచిపెట్టారు. ఆర్‌డీవో కే బాలకృష్ణ, తహసీల్దార్ సురేష్ ఆ ప్రాంతంలో పర్యటించి స్థానికుల నుంచి సమాచారం సేకరించారు. మట్టి తవ్వకాలు నిరంతరం జరుగుతున్నాయని, అంతేకాక కృష్ణానది నుం చి ఇసుక కూడా అక్రమంగా తరలివెళుతుందని చెప్పిన ట్టు తెలిసింది. స్పందించిన ఆర్‌డీవో ఇకపై మట్టి తవ్వకా లు జరగకుండా నిఘా ఏర్పాటు చేయాలని, ఈ తవ్వకాల వెనుక ఎవరు ఉన్నారో తెలుసుకొని చర్యలు చేపట్టాలని తహసీల్దార్ సురేష్‌ను ఆదేశించారు. మట్టి తవ్వకాలు జరిపినా, రవాణా చేసినా సదరు వాహనాలను పట్టుకొని సీజ్ చేయాలని సిబ్బందికి సూచించారు.

తవ్వకాలు ఆగేనా..?

ఆంధ్రజ్యోతి కథనంతో స్పందించిన ఆర్‌డీవో పెద్దవరం వెళ్లే లోపే అక్రమార్కులకు సమాచారం అందింది. వాహనాలను సైడ్ చేసి అధికారుల కళ్లు కప్పారు. దీన్ని బట్టి



అక్రమార్కులు మట్టి తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డీవో బాలకృష్ణ, తహసీల్దార్ సురేష్‌కుమార్

కొందరు రెవెన్యూ అధికారులు వారికి సహకరిస్తున్నట్టు తేటతెల్లమైంది. అవినీతి అధికారుల సహకారంతో యథేశ్చగా సాగిస్తున్న ఈ దోపిడీ ఆర్‌డీవో పర్యటనతో ఆగుతుందా అన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. అధికార పార్టీ నేతలు తాము చేస్తున్న దోపిడీని బయట పెట్టకుండా ఉండేందుకు వైసీపీ నేతలకు కూడా అవకాశం ఇస్తున్నట్టు విమర్శలు వస్తున్నాయి. గతంలో వైసీపీ అధికారంలో ఉండగా ఇదే తీరున మట్టి, ఇసుకను ఇరు పార్టీల నేతలు పంచుకొని దోపిడీ చేశారని ఆరోపిస్తున్నారు. ఇకనైనా ఈ దోపిడీని ఆపకపోతే ఆందోళన చేపడతామని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ దోపిడీని అడ్డుకోవడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి ప్రకృతి సంపద అన్యాక్రాంతం కాకుండా చూడాలని వారు కోరుతున్నారు.

దైవ సంకల్పంతో రాజధాని అభివృద్ధి

● ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు
● భువనేశ్వరీ పీఠం నూతన భవనం నిర్మాణానికి శంకుస్థాపన

గన్నవరం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతికి వాక్ శుద్ధి గల స్వామీజీల అండతో పాటు దైవ బలం కూడా తోడవడంతో గత ప్రభుత్వం అమరావతిని అంగుళం కూడా కదల్చలేకపోయిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మండలంలోని కేసరపల్లి భువనేశ్వరీ పీఠం నూతన భవన నిర్మాణానికి టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు తొండేపు దశరథ జనార్ధన్‌తో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. శివపార్వతుల కల్యాణాన్ని తిలకించి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడుతూ యువత, మేధావులు వలస వెళ్లడంతో కృష్ణాజిల్లా నిర్వీర్యంగా మారే ప్రమాదం ఉందని అన్నారు. గతంలో జిల్లా నుంచి అత్యధికంగా పన్నులు చెల్లించేవారని, ట్యాక్స్ పేయర్స్ అందరూ వలస వెళ్లిపోవటంతో జిల్లాలో యువతకు ఉద్యోగావకాశాలు లేక విదేశీ బాట పట్టారన్నారు. టీడీపీ ప్రభుత్వం రాజధానిగా అమరావతిని నిర్ణయించి పనులు ప్రారంభిస్తే తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. లోక కల్యాణం కోసం పరితపిస్తున్న కమలానంద భారతీస్వామిని అభినందించారు. అప్పట్లో అధికార పార్టీలో ఉన్న తమతో పాటు కొందరు ఎమ్మెల్యేలు సైతం మూడు రాజధానులను వ్యతిరేకించారని గుర్తు చేశారు. జిల్లా అభివృద్ధికి పాటుబడిన మహనీయుల విగ్రహాలను జిల్లా కేంద్రంలో పెట్టేందుకు అధికారులు ముందుకు రాకపోతే తన స్వంత నిధులతో ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. కొత్తగా నిర్మించే పీఠం భవనం ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రిని తీసుకువస్తామన్నారు. టీడీ జనార్ధన్ మాట్లాడుతూ అమరావతి అబివృద్ధి, సంపదకు కేంద్రమని అభివర్ణించిన ఆయన సీఎం చంద్రబాబు దూరదృష్టితో భూములిచ్చిన రైతులకు ప్రయోజనం కలిగేలా దేశంలోనే తొలిసారిగా భూ సమీకరణ చేపట్టారన్నారు. అమరావతి ఉద్యమంలో భువనేశ్వరీ పీఠాధిపతి కమలానంద భారతి స్వామి రాజధానిలోని 29 గ్రామాల్లో పాదయాత్ర చేసి, ఎస్సీ కాలనీల్లో నిద్రించి ప్రజలను చైతన్యవంతం చేశారన్నారు. రాష్ట్రంలోని పెద్దసంఖ్యలో స్వామీజీలు మద్దతు పలకటం శుభపరిణామమన్నారు. మైనారిటీ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఫారుఖ్ షుబ్లీ, పాలడుగు రాఘవేంద్ర, దమ్మాలపాటి చంద్రశేఖర్, మూల్పూరి మాధవన్, విష్ణుభట్ల రామచంద్ర, రాఘవశర్మ పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

రైతుల సంక్షేమానికి కృషి చేస్తా

● కేడీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ



మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తనకిచ్చిన పదవిని రైతుల సంక్షేమానికి వినియోగిస్తానని ఉప ముఖ్యమంత్రి, జనసేన రాష్ట్ర అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌కు వాగ్దానం చేసినట్టు ఆ పార్టీ మచిలీపట్నం నియోజకవర్గ అధ్యక్షుడు, కృష్ణాజిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ బండి రామకృష్ణ తెలిపారు. బుధవారం ఉదయం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కలిసి బండి రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మచిలీపట్నంలో మీడియాతో మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో మాట్లాడానని, రైతుల దీర్ఘకాలిక సమస్యలను ఆయన దృష్టికి తీసుకువస్తానని చెప్పానన్నారు. జనసేన పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. పవన్‌కల్యాణ్ తనపై చూపిన ఆత్మీయత, అభిమానం కలకాలం నిలిచేలా, అందరూ మెచ్చేలా నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. ఈ వారంలో సీఎం చంద్రబాబును స్వయంగా కలిసి కృతజ్ఞతలు చెబుతానన్నారు. తన నియామకానికి సహకరించిన ఎంపీ వల్లభనేని బాలశౌరి, మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఉమ్మడి కృష్ణాజిల్లా టీడీపీ, బీజేపీ, జనసేన ప్రజాప్రతినిధులకు, కూటమి నేతలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

కలెక్షన్ పాయింట్లుగా డ్రైనేజీ కనెక్షన్లు

● కొత్త కనెక్షన్లు అంటే భయపడుతున్న జనం
● డ్రైనేజీ కనెక్షన్లు ఫీజు కంటే ఆయన ఫీజే ఎక్కువ
● ఎమ్మెల్యే వార్నింగ్ ఇచ్చినా మారని తీరు
● ఆటోలో వెళ్లి మరీ డిమాండ్

మధురానగర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ నియోజకవర్గంలో ఒక డ్రైనేజీ ఇన్‌స్పెక్టర్ దెబ్బకు కొత్త కనెక్షన్లు తీసుకోవాలంటేనే జనం బెంబేలెత్తుతున్నారు. అసలు కంటే కొసరు బాదుడికి భయపడే పరిస్థితి నెలకొంది. వీఎంసీ వాహన డిపోలో వాహనాలకు ఇందనం కొట్టే చోట పని చేసే ఇతడు కొద్ది నెలల క్రితం ఈ ఏరియా ఇన్‌స్పెక్టర్ పదవీ విరమణ చేయగానే బదిలీపై వచ్చి తన తడఖా చూపించడం మొదలు పెట్టాడు. వాస్తవానికి ఇంట్లో ఒక మరుగుదొడ్డికి వీఎంసీకి చెల్లించేది మొదటి దానికి రూ.2500. రోడ్ కటింగ్ చార్జీలు రూ.3300 కలిపి మొత్తం రూ.5,300 మాత్రమే. ఒకటికంటే ఎక్కువ ఉంటే అదనంగా ఉన్నదానికి కేవలం రూ.1250 మాత్రమే. కొత్త కనెక్షన్‌కు దరఖాస్తు చేస్తే 24 గంటల్లో అనుమతి మంజూరు చేయాలి. కానీ ఇతడి చేతిలో 'ప్రసాదం' పడనిదే అనుమతి రాదు. మధురమైన ఆ ప్రాంతంతో పాటు పక్కనే మరో డివిజన్ కూడా కలవడం కలిసి వచ్చింది. ఇటీవల డివిజన్‌లో సాయిబాబా పేరుతో ఉన్న కాలనీలో ఒక ఇంటికి ఆటోలో వెళ్లి మరీ రూ.15వేలు డిమాండ్ చేసినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఇదే డివిజన్‌లో ఒక పాఠశాల పక్కనే ఉన్న అపార్టుమెంట్‌కు కనెక్షన్లు ఇవ్వడానికి అదనంగా ప్లాట్‌కు ఇంత అని నిర్ణయించి మొత్తంగా రూ.25వేలు ఇవ్వాలని హుకుం జారీ చేశాడు. దీంతో అపార్ట్‌మెంట్ వాసులందరూ కలిసి టీడీపీ డివిజన్ అధ్యక్షుడి దృష్టికి విషయం తీసుకెళ్లి మధ్యేమార్గంగా రూ.10వేలు సమర్పించినట్టు సమాచారం. పక్క డివిజన్‌లో సినిమా థియేటర్ పక్కనే ఉన్న రెస్టారెంట్ వారు అనధికారంగా కనెక్షన్లు వాడుతున్న విషయం గమనించి వారి నుంచి రూ.30వేలు బాదేశాడు. తరువాత కొత్త కనెక్షన్లు పేరుతో మార్చాడు. గుణదలకు ఉత్తరం వైపు కాల్వల మధ్యలో పొలాలకు అనుకుని ఉండే ఈ ప్రాంతంలో అపార్టుమెంట్లు, ఇండివిడ్యువల్ ఇళ్ల నిర్మాణం జోరుగా ఉండటంతో కలెక్షన్‌పై మరింత శ్రద్ధ పెట్టాడు. 4 నెలల క్రితం ఇతడి వ్యవహారం ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు వద్దకు వెళ్లగా ఆయన తీవ్రంగా మందలించడంతో కొద్దిరోజులు విధులకు దూరంగా ఉంచారు. మళ్లీ విధుల్లోకి రాగానే తీరు మారకపోగా తాను కూడా అధికార పార్టీకి చెందిన వ్యక్తిగా చెప్పుకుంటూ డ్రైనేజి కనెక్షన్‌లను కాసులకు కలెక్షన్ పాయింట్‌లుగా మార్చుకున్నాడు. ఇతడి దెబ్బకు ఏఈ, డీఈలే హడలిపోతున్నారు.

డీఎస్సీలో క్రీడాకారులకు 3శాతం కోటా

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



విజయవాడ స్పోర్ట్స్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం 3 శాతం హారిజంటల్ రిజర్వేషన్ కల్పిస్తూ, ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాలు కల్పిస్తోందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం శాప్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం, క్రీడాప్రాధికార సంస్థ మెగా డీఎస్సీ-2025లో భాగంగా 3 శాతం క్రీడా కోటా నోటిఫికేషన్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి దిశానిర్దేశం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు. ఈ మెగా డీఎస్సీలో విడుదల చేసిన 16,347 పోస్టుల్లో 421 పోస్టులను స్పోర్ట్స్ కోటా కింద కేటాయించడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక క్రీడాకారులకు 3 శాతం రిజర్వేషన్ సౌకర్యంతో పాటు ప్రతిభ చూపిన క్రీడాకారులకు ఇన్సెంటివ్స్ అందిస్తుందన్నారు. మే 2 నుంచి 31 వరకు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఫేక్ సర్టిఫికెట్లపై ఉక్కుపాదం మోపుతామని మంత్రి తెలిపారు. మెగా డీఎస్సీలో క్రీడా కోటా కింద ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ పాఠశాలల్లో 333 పోస్టులు, మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో 30 పోస్టులు, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలల్లో 22 పోస్టులు, ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 2 పోస్టులు, ఏపీ మోడల్ పాఠశాలల్లో 4 పోస్టులు, ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 7 పోస్టులు, ఏపీ గురుకుల వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 23 పోస్టులు కేటాయించినట్టు తెలిపారు. క్రీడా ప్రాదికారసంస్థ ఎండీ గిరీష, శాప్ అధికారులు పాల్గొన్నారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 440

జాతీయ రక్షణ నిధికి చిరువ్యాపారి నాగేంద్రబాబు విరాళం

చల్లపల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : కాశ్మీర్‌లో ఉగ్రవాద దాడి నేపథ్యంలో చల్లపల్లి బస్టాండ్ సెంటరులో టిఫిన్ బండి నడుపుతున్న చిరువ్యాపారి యామా నాగేంద్రబాబు జాతీయ రక్షణ నిధి (నేషనల్ డిఫెన్స్ ఫండ్)కి రూ.10వేల విరాళం అందజేశాడు. ఉగ్రవాద దాడిలో 28మంది పర్యాటకులు మృతిచెందటం తననెంతో ఆవేదనకు గురిచేసిందన్నారు. దేశ రక్షణ కోసం సైనికులు ఎంతగానో శ్రమిస్తున్నారనీ, ప్రస్తుత పరిస్థితుల్లో వారి సంక్షేమానికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాల్సిన అవసరముందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. తనవంతుగా నేషనల్ డిజాస్టర్ ఫండ్ ఖాతాకు ఆన్‌లైన్ ద్వారా రూ.10,110లను పంపించి దేశభక్తిని చాటుకున్నాడు.

యథేచ్ఛగా తెలంగాణ మద్యం విక్రయాలు!

- సుల్తానగరంలో మద్యం పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు
- బెల్టుషాపులను నియంత్రించరూ..

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : బందరు చుట్టుపక్కల బడ్డీల్లో తెలంగాణా మద్యం అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి. తెలంగాణా నుంచి మచిలీపట్నంకు కొందరు వ్యాపారులు దొంగచాటున మద్యాన్ని తీసుకువస్తున్నారు. ఈ మద్యాన్ని సుల్తానగరం, పోతేపల్లి, ఎన్టీఆర్ కాలనీ, వైఎస్‌ఆర్ కాలనీ, నవీన్‌మిట్టల్ కాలనీ, గిలకలదిండి తదితర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు.



పట్టుబడ్డ తెలంగాణ మద్యం

సుల్తానగరంలో తెలంగాణా మద్యం ఓ బడ్డీలో ఉందని ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదు మేరకు ఎక్సైజ్ సీఐ కె. ప్రకాష్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ అధికారులు సుల్తానగరంలో దాడులు జరిపారు. ఈ దాడుల్లో మోతుకూరి నాగబాబు బడ్డీలో 10 బాటిల్స్ ఉన్నట్టు గుర్తించారు. ఎక్సైజ్ యాక్టు 34ఏ కింద కేసు నమోదు చేశారు. నిందితుడిని కోర్టుకు తీసుకువెళ్లగా తాను బడ్డీలో విక్రయించడం లేదని, మద్యం తాగేందుకే తీసుకుని వచ్చానని అధికారులకు, న్యాయమూర్తులకు చెప్పారు. బెల్టుషాపులపై ఎక్సైజ్ సీఐ ప్రకాష్‌ను వివరణ కోరగా ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది పోతేపల్లి, ఎన్టీఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లో దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.



సీజ్ చేసిన టిప్పర్లు

ఐదు టిప్పర్లు, జేసీబీ సీజ్

గూడూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : చటారివారిపాలెంలోని చెరువును ప్రభుత్వ అనుమతులు లేకుండా పూడుస్తున్న టిప్పర్లు, జేసీబీని బుధవారం ఆర్ఐ ఝన్సీరాణి, రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. కూచిపూడి నుంచి మట్టి టిప్పర్లతో చెరువు పూడుస్తున్నారన్న సమాచారంతో తహసీల్దార్ డి. రాజ్యలక్ష్మి ఆదేశాల మేరకు ఆర్ఐ ఝన్సీరాణి, రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. ఐదు టిప్పర్లు, ఒక జేసిబిని సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.

అనుమతులు లేనిదే మట్టి తరలించొద్దు

కోడూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేనిదే మట్టి తరలించరాదని కోడూరు తహసీల్దార్ శ్రీను నాయక్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోడూరు మండలంలో మట్టి తవ్వకాలకు, ఇసుక తవ్వకాలకు ఎటువంటి అనుమతులు లేవన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఉల్లిపాలెంలో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయన్న సమాచారంతో వెంటనే వాటిని నిలుపుదల చేశామన్నారు. అనుమతులు లేకుండా మట్టిని తరలించిన యెడల చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు.



విద్యార్థి చదువుకు నగదు అందిస్తున్న దళిత నేతలు

ఆర్థిక సాయం

అవనిగడ్డ రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : బందలాయి చెరువు దళితవాడకు చెందిన యశ్వంత్ అనే విద్యార్థి చదువుకోసం దళిత నేతలు సాయమందించారు. కమ్మిలి మారిబాబు నాయకత్వంలో గ్రామస్థులు స్పందించి రూ.33 వేలు సేకరించి విద్యార్థికి అందించారు. ఈ కార్యక్రమంలో సుధీర్, సింహాద్రి, మోక్షానంద్ పాల్గొన్నారు.

గంగమ్మ జాతర 5న

నాగాయలంక, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నాగాయలంక బస్టాండ్ రోడ్డులో కొలువై ఉన్న మండవ వారి ఇలవేల్పు గంగమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఈ నెల 5వ తేదీన నిర్వహిస్తున్నట్టు ఆలయ చైర్మన్ మండవ మధుసూదనరావు తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్నసమారాధన నిర్వహించనున్నామన్నారు. భక్తులు విరివిగా విచ్చేసి ఈ జాతరను జయప్రదం చేయాలని ఆయన కోరారు.



అర్చనల్లో పాల్గొన్న భక్తులు

అయ్యప్పస్వామి దేవాలయంలో అర్చనలు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గాంధీబొమ్మసెంటర్‌లోని అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం వైభవంగా అయ్యప్ప స్వామికి అభిషేకాలు, అర్చనలు ఆలయ అర్చకులు నిర్వహించారు. స్వామి 34వ వార్షిక ప్రతిష్ఠ సప్తాహ మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. మే 5 వరకు జరిగే ఈ కార్యక్రమాల్లో అయ్యప్ప స్వామిని వివిధ అర్చనలు, అభిషేకాలు, భజనలు, సామూహిక పారాయణలు నిర్వహించనున్నారు.

పూడికతీత పనులు ప్రారంభం

గుడివాడ రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : రైతులకు మేలు చేయాలని కూటమి ప్రభుత్వం పంట కాలువలకు, మురుగు కాలువల పూడికతీత పనులు చేపడుతుందని సెరిగొల్లేపల్లి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నూతక్కి కుటుంబరావు అన్నారు. బుధవారం తట్టివర్రులో 2.5 కిలోమీటర్ల దూరం ఉన్న సీపూడి, రామన్నపూడి, తట్టివర్రు పొలాలకు మురుగు కాలువల పూడికతీత పనులు ప్రారంభించారు. సీపూడి, రామన్నపూడి, తట్టివర్రు గ్రామాల రైతులు ఎమ్మెల్యే వెనిగండ్ల రామును పూడికతీత పనుల విషయమై అడుగగా, నిధులు మంజూరు చేయించామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



శ్రీకాకుళంలో బాల్యవివాహాల అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న పురోహితులు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

మోపిదేవి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయటం ద్వారా ఆరోగ్య సమస్యలు తలెత్తటమే కాక చట్టరీత్యా శిక్షార్హులవుతారని వాసవ్య మహిళా మండలి ప్రతినిధులు ఉషారాణి, దివ్యలు తెలియజేశారు. అక్షయ తృతీయ పురస్కరించుకుని మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలో ఆలయానికి వచ్చే భక్తులకు బుధవారం బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆలయ అర్చకుల ద్వారా భక్తులకు బాల్య వివాహాలు, అనర్థాల గురించి తెలియజేశారు. పురుషులకు 21 సంవత్సరాలు, మహిళలకు 19 సంవత్సరాలు దాటిన తర్వాతే వివాహాలు చేయాలని భక్తులకు అవగాహన కల్పించారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించొద్దు

ఘంటసాల : బాల్య వివాహాలను ప్రోత్సహించొద్దని పురోహితులు పలువురు భక్తులకు తెలియజేశారు. శ్రీకాకుళంలోని శ్రీకాకుళేశ్వరస్వామి దేవాలయానికి విచ్చేసిన భక్తులు పురోహితులు ఎం.విష్ణువర్ధన్ బాబు, కోట వెంకట శ్రీరామ శర్మలు మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. గ్రామాల్లో, కుటుంబసభ్యుల్లో అలాంటి వివాహాలను ప్రోత్సహించవద్దని పేర్కొన్నారు. వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఎస్‌డబ్ల్యూ దివ్య, ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఉషారాణి, మహిళా పోలీసు మౌనిక, అంగన్‌వాడీ కార్యకర్త ఆదిరాల కనకదుర్గ, వార్డుమెంబర్ దాసం రామకృష్ణ, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

తోట హరిబాబుకు సన్మానం



పెడన, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఆదర్శవంతమైన ఉద్యోగ జీవితం గడిపిన హరిబాబును ప్రాథమిక సహకార సంఘాల ఉద్యోగులు స్ఫూర్తిగా తీసుకోవాలని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు అన్నారు. పట్టణంలోని జయలక్ష్మి పీఏసీఎస్‌లో 33 సంవత్సరాల పాటు అక్కౌంటెంట్‌గా, సీఈవోగా బాధ్యతలు నిర్వహించి బుధవారం పదవీవిరమణ చేసిన తోట హరిబాబుకు ఆ పీఏసీఎస్ ఆవరణలో ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వేణుగోపాలరావు మాట్లాడుతూ అత్యుత్తమ సేవలందించడం ద్వారా రైతుల హృదయాలలో ఆయన చిరస్థాయిగా నిలిచారన్నారు. కాగా హరిబాబు, మారుతి దంపతులను పూలమాలలు, దుశ్శాలువాలు, జ్ఞాపికలు, వస్త్రాలతో సత్కరించారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చందన నారాయణరావు, విద్యావేత్త మట్టా రాధాకృష్ణమూర్తి, పీఏసీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు పర్యావుల రామాంజనేయులు, కేడీసీసీ బ్యాంకు చీఫ్ మేనేజర్ లావణ్య, పుట్టి సాంబశివరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



అవనిగడ్డ గ్రంథాలయంలో కథలు చదువుతున్న విద్యార్థిని

ఉత్సాహంగా వేసవి శిక్షణ తరగతులు

అవనిగడ్డ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో అవనిగడ్డ గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. దాదాపు 50 మందికిపైగా చిన్నారులు వేసవి శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొని కథలు చెప్పటం, డ్రాయింగ్ వేయటం తదితరాలపై శిక్షణ పొందుతున్నారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో అవనిగడ్డ హెడ్ పోస్టు మాస్టర్ ఎస్.సుధాకర్, విశ్రాంత ఉపాధ్యాయుడు కరుణశ్రీ, అసిస్టెంట్ పోస్టు మాస్టర్ విశ్వనాథపల్లి నాగేశ్వరరావు, గ్రంథాలయ అధికారి జె.ప్రభుదాసు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కరుణశ్రీ పాటల ద్వారా అభ్యాస కార్యక్రమం నిర్వహించారు.

గ్రంథాలయంలో నృత్య ప్రదర్శన

నాగాయలంక : వేసవి విజ్ఞాన తరగతులలో భాగంగా బుధవారం నాగాయలంక శాఖ గ్రంథాలయంలో చిన్నారులకు నృత్యంలో శిక్షణ ఇచ్చారు. ఈశ్వర్ డ్యాన్స్ మార్షల్స్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన నృత్య ప్రదర్శనలు పాఠకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గ్రంథాలయాధికారి డి.రామకృష్ణ పర్యవేక్షించారు.

నరసింహస్వామి దేవాలయంలో కల్యాణోత్సవాలు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : జలాల్‌పేట నరసింహస్వామి దేవాలయంలో బుధవారం నుంచి స్వామి కల్యాణోత్సవాలు ప్రారంభమయ్యాయి. వేదపండితులు నారాయణ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అతిథిగా కృష్ణాజిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వి. రామకృష్ణయ్య, వాలిశెట్టి తిరుమలరావు, బొడ్డు శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక అర్చనలు నిర్వహిస్తున్నారు.



నారాయణ హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

కౌన్సిల్ అత్యవసర సమావేశం వాయిదా

పెడన, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : పెడన మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం వాయిదాపడింది. 27 అంశాలతో కూడిన అజెండాతో బుధవారం కౌన్సిల్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశం ప్రారంభం కాక ముందే 9వ వార్డు కౌన్సిలర్ గరికముక్కు చంద్రబాబు లేచి పైడమ్మ లే అవుట్ సమీపంలో ఆక్రమణకు గురైన 18 సెంట్ల స్థలానికి సంబంధించిన అంశాన్ని వచ్చే సమావేశంలో అజెండాలో పెడతానని గత సమావేశంలో హామీ ఇచ్చి ఈ సమావేశంలో ఎందుకు అజెండాలో పెట్టలేదని కమిషనర్‌ను ప్రశ్నించారు. దీనిపై కమిషనర్ ఎం. గోపాలరావు బదులిస్తూ జీవో నెంబర్ 624ను అనుసరించి ప్రభుత్వ పరిధిలో విచారణలో ఉన్నందున 18 సెంట్ల ఆక్రమణకు సంబంధించిన స్థలాన్ని అజెండాలో చేర్చలేదన్నారు. ఈ సమావేశంలోనే ఆక్రమణ అంశాన్ని టేబుల్ ఏజెండాగా చేర్చాలని చంద్రబాబు డిమాండ్ చేశారు. ఈ అంశంపై 8వ వార్డు కౌన్సిలర్ కటకం ప్రసాద్ మాట్లాడుతూ, ఆక్రమణ అంశాన్ని అజెండాలో చేర్చడానికి ఎందుకు వెనుకాడుతున్నారని కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆక్రమణ అంశాన్ని అజెండాలో చేర్చకుండా సర్వీసు రూల్స్‌కు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్, డీఎంఏలకు ఫిర్యాదు చేయాలని, అందాక సమావేశం వాయిదా వేయాలని చంద్రబాబు, కటకం ప్రసాద్‌లు చైర్‌పర్సన్ కటకం నాగకుమారిని కోరారు. వారి కోరిక మేరకు ఆమె సమావేశాన్ని వాయిదా వేశారు. దీంతో అజెండాపై చర్చ జరగకుండానే సమావేశం వాయిదా పడింది. మేనేజర్ మట్టా రాజా, టీపీవో సుజనకుమారి, ఆర్ఐ పామర్తి వెంకటేశ్వరరావు, ఏఈ రామాంజనేయులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరికిషోర్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

జలధీశ్వరస్వామికి రూ. లక్ష విరాళం



ఘంటసాల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలపార్వతీ సమేత జలధీశ్వరస్వామి ఆలయంలో జరిగే వేదిక నిర్మాణానికి విజయవాడకు చెందిన ప్రముఖ వైద్యులు చలమలశెట్టి ప్రసాద్ బాబు కుటుంబసభ్యులు లక్ష విరాళాన్ని అందించారు. జలధీశ్వరస్వామి దేవాలయంలో రూ.2.80 లక్షల అంచనాలతో అష్టాదశ శక్తి పీఠాలు, ద్వాదశ జ్యోతిర్లింగాల వేదిక నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ విషయాన్ని జెడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకృష్ణ ద్వారా తెలుసుకున్న దాత చలమలశెట్టి ప్రసాద్‌బాబు కుటుంబ సభ్యులు ఈ మేరకు నిర్ణయం తీసుకుని బుధవారం దేవాలయ అభివృద్ధి కమిటీ నిర్వాహకులకు కొండపల్లి రామకృష్ణకు విరాళాన్ని చెక్కు రూపంలో అందించారు.

చుక్కల భూముల రైతులు అర్జీలు అందించండి

కోడూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కోడూరులో చుక్కల భూములు గల (22/ఏ) రైతులు తమ సమస్య పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరుతూ అర్జీలు సమర్పించాలని కోడూరు మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు పూతబోయిన కరుణ కుమార్ కోరారు. స్థానిక జనసేన కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశానుసారంగా షరతులు గల పట్టా భూములు గల రైతులు ఎమ్మెల్యే కార్యాలయంలో గానీ, కోడూరు జనసేన కార్యాలయంలో గానీ అర్జీలు సమర్పించాలన్నారు. ఈ అర్జీలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మద్రే గంగయ్య, కోట రాంబాబు, జరుగు పోతురాజు, కాగిత రామారావు తదితరులు పాల్గొన్నారు.



అవనిగడ్డలో నిరసన వ్యక్తం చేస్తున్న డీఎస్సీ ఆశావాహులు

మెగా డీఎస్సీలో జిల్లాకు ఒకే పేపర్ పెట్టండి : డీవైఎఫ్ఐ

అవనిగడ్డ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్ పరీక్షలో ఒక జిల్లాకు ఒకే పేపర్ పెట్టాలని కోరుతూ అవనిగడ్డలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో డీఎస్సీ ఆశావాహులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న మాట్లాడుతూ నిరుద్యోగులు అనేక పోరాటాలు చేసి సాధించుకున్న మెగా డీఎస్సీ ఎక్కువ మంది నిరుద్యోగులను విస్మరించే విధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎస్సీలో ఒక జిల్లాకు ఒకే పేపర్ పెట్టడం వల్ల సమన్యాయం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు చదువుకోవటానికి తగిన సమయం ఇవ్వాలని, రెగ్యులర్ నోటిఫికేషన్ లేనందున అభ్యర్థులకు వయోపరిమితి 47కు పెంచాలని కోరారు. డీఎస్సీ పరీక్ష నిజాయితీగా నిర్వహించాలని కోరారు. తక్షణమే ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ, డీఎస్సీ ఆశావాహులు శ్రీను, అయ్యప్ప, చంద్ర, జానకి రామ్, రాజు, హేమచంద్ర తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి పర్సు అప్పగింత

ఆరు గంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణిస్తూండగా తన పర్సు పోయిందని ఓ వృద్ధురాలు చిలకలపూడి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బుధవారం వృద్ధురాలు విజయలక్ష్మి కోనేరుసెంటర్ నుంచి కలెక్టర్ బంగ్లా దగ్గర ఉన్న తన ఇంటికి వెళుతుండగా పర్సును పోగొట్టుకుంది. చిలకలపూడి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు సీసీ కెమెరా పుటేజిని చూశారు. ఈ సీసీ కెమెరా పుటేజిలో ముగ్గురు పరిగెడుతున్నట్టు కనుగొన్నారు. నగరంలోని సీసీకెమెరా పుటేజిలను పరిశీలించగా పర్సు దొంగిలించిన ముగ్గురు దొంగలు బైట పడ్డారు. వీరిలో నెల్లూరుకు చెందిన రాజేష్, శ్రీనులు, తిరుపతికి చెందిన మాధవలు ఈ దొంగతనం చేసినట్టు గుర్తించారు. ఫిర్యాదు ఇచ్చిన ఆరు గంటలలోపు చిలకలపూడి పోలీసులు కేసును ఛేదించారని సీఐ నబీ తెలిపారు. నగరంలోని సీసీ కెమెరాల సాయంతో ఈ కేసును ఛేదించినట్టు సీఐ తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు పర్సు దొంగతనానికి గురికాగా సాయంత్రం 6 గంటలకు కేసును ఛేదించి వృద్ధురాలి వద్ద అపహరణకు గురైన సొమ్ము రూ.18వేలు అందజేసామన్నారు. ఆటో డ్రైవరు అబ్బాస్ ముగ్గురు దొంగలను గుర్తించాడు. సీసీ పుటేజిలో ఆటో నెంబరును చూసి ఆటో డ్రైవరుకు ఫోను చేసినట్టు సీఐ తెలిపారు.



టీడీపీ సంస్థాగత ఎన్నికల్లో మాట్లాడుతున్న గొర్రెపాటి గోపీచంద్

పార్టీ కోసం కష్టపడి పనిచేసేవారినే ఎన్నుకోండి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు, పార్టీకి కష్టపడి పనిచేసే వారిని ఎన్నుకోవాలని టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. బుధవారం 45వ డివిజన్ రాయపాటి శ్రీరాములు మెమోరియల్ పార్కులో, బందరు మండలం ఎస్ఎన్ గొల్లపాలెం తదితర ప్రాంతాల్లో టీడీపీ సంస్థాగత ఎన్నికలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్‌తో పాటు టీడీపీ ఫ్లోర్ లీడర్ పల్లపాటి సుబ్రహ్మణ్యం, డివిజన్ ఇన్‌చార్జి పి.వి. ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడుగా గంజాల రవికుమార్, ఉపాధ్యక్షుడుగా ఈడే పృథ్వీరాజ్, ప్రధాన కార్యదర్శిగా కొనకళ్ళ భానుప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా తోట శ్యామ్‌కుమార్, మడిపల్లి శ్రీను, కార్యదర్శులుగా సయ్యద్ అబ్బాస్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



జనసేన నేత బండి రామకృష్ణకు సత్కారం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ అధ్యక్షుడిగా నియమితులైన బండి రామకృష్ణను బుధవారం టీడీపీ నాయకులు సత్కరించారు. బండి రామకృష్ణ ఇంటికి వెళ్లి మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, టీడీపీ నాయకులు తలారి సోమశేఖర్ తదితరులు సత్కరించారు.



లక్ష రూపాయల విరాళాన్ని అందజేస్తున్న లంకిశెట్టి బాలాజీ

అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ. లక్ష విరాళం

గూడూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఆకుమర్రులోని హైస్కూల్‌లో అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం లంకిశెట్టి బాలాజీ, వనజ దంపతులు బుధవారం రూ. లక్ష విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ గోపీ నాగబాబు, మాజీ వీఆర్వో లంకిశెట్టి సాయిబాబు, తాడేపల్లి రమేష్, మల్లంపల్లి వీరవెంకట రామాంజనేయులుబాబు, ఎస్‌బీఐ విశ్రాంత ఉద్యోగి లీలాప్రసాద్, స్కూల్ హెచ్‌ఎం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మట్టి ఖర్చులకు..

మచిలీపట్నం టౌన్ : జొన్నలవారిమోడి గ్రామంలో మృతిచెందిన వడ్డి యర్రయ్య కుటుంబసభ్యులకు కానూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం పక్షాన మట్టి ఖర్చులకు రూ. 10 వేలును కృష్ణాజిల్లా తెలుగురైతు అధ్యక్షుడు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ అందజేశారు. యర్రయ్య భార్య వడ్డి అనసూయవతికి ఈ విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈమన దాసు, పీఏసీఎస్ కార్యదర్శి అడపా శ్రీనివాసరావు, ఈమన హరిబాబు, ఇల్లూరి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు


అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 440

ట్రాఫిక్ ఎస్సై ప్రసాద్ సేవలు మరువలేనివి

గుడివాడ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ ఎస్సైగా జి.వి ప్రసాదరావు చేసిన సేవలు మరువలేనివని, పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడంలో ముఖ్య పాత్ర పోషించారని ట్రాఫిక్ ఏఎస్సైలు రత్నరాజు, శంకరరావు, భాగ్యవతిలు పేర్కొన్నారు. ఎస్సై ప్రసాదరావు పదవి విరమణ సందర్భంగా బుధవారం స్థానిక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఆయనను ట్రాఫిక్ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రైటర్ వీరాస్వామి, హెడ్ కానిస్టేబుల్ రామచంద్రరావు, శ్రీనివాస్, రామకృష్ణ, మోహనరావు, మహిళా కానిస్టేబుల్ మాధవిలత, కానిస్టేబుళ్లు, హోమ్‌గార్డులు పాల్గొన్నారు.


ట్రాఫిక్ ఎస్సై ప్రసాదరావును సత్కరిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది


గంగానమ్మ తల్లికి మొక్కులు తీర్చుకుంటున్న గ్రామస్థులు

ఘనంగా గంగానమ్మ వార్షికోత్సవం

పెదపారుపూడి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పెదపారుపూడిలోని భూషణగుళ్ల గ్రామ దేవత గంగానమ్మ తల్లి 20వ వార్షికోత్సవం సందర్భంగా గ్రామ ప్రజలు తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమలను సంపంగి శ్రీకాంత్ సమర్పించారు. వార్షికోత్సవం సందర్భంగా ప్రతీ సంవత్సరం మాదిరిగానే, ఈ సంవత్సరం కూడా గ్రామ ప్రజలు, భక్తుల సహకారంతో అన్నసమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


విరాళాన్ని అందజేస్తున్న రామచంద్రరావు

ఆలయ నిర్మాణానికి విరాళం

గుడివాడ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : స్థానిక మెయిన్‌రోడ్డులో వేంచేసియున్న విఘ్నేశ్వరస్వామి దేవస్థానం ముఖమండపం పునఃనిర్మాణం నిమిత్తం స్థానికులు పిన్నమనేని రామచంద్రరావు రూ.10,116లు విరాళంగా అందజేశారు. బుధవారం ఉత్సవ కమిటీ చైర్మన్ సాయన రాజేష్‌కు అందించారు. ఈ సందర్భంగా దాతను దేవస్థాన వేదపండితులు ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందించారు.

ఈ రహదారిపై ప్రయాణం నరకం

• బుసకమట్టి దిబ్బలతో ప్రయాణికులకు తప్పని తిప్పలు • పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి - తోట్లవల్లూరు) : తోట్లవల్లూరులోని ఆర్‌అండ్‌బీ రోడ్డుపై లారీల నుంచి జారిపడిన ఇసుక, బుసక దిబ్బల్లాగా పేరుకుపోయి వాహనదారులకు ఇబ్బందిగా మారింది. కేఈబీ కెనాల్ వంతెన నుంచి దళితవాడ వరకు రోడ్డుపై బుసకమట్టి దిబ్బలు పేరుకుపోయాయి. దుమ్ము లేవకుండా ట్యాంకర్లతో వాటరింగ్ చేస్తుండటంతో లారీల నుంచి జారిన ఇసుక, బుసక గట్టిపడి అడుగు ఎత్తున దిబ్బల్లాగా మారి అడుగుకో గొయ్యిలా మారిపోయింది. పెద్ద వాహనాలే కాదు సైకిల్‌పై వెళ్లాలన్నా నడుములు పట్టేస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. శివాలయం, వేణుగోపాల స్వామి ఆలయాల మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి సెంటర్‌లో, మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల వద్ద విపరీతంగా బుసకమట్టి పేరుకుపోయింది. వాటరింగ్ చేయిస్తున్నా ఈ దిబ్బలతో రోడ్డుపై ప్రయాణించలేని దుస్థితి ఏర్పడిందని ప్రయాణికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలామంది కేఈబీ కెనాల్ వంతెన నుంచి పాత పోస్టాఫీస్ రోడ్డు, షిర్డి సాయిబాబా రోడ్డుల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి ఎక్సకవేటర్‌తో బుసకమట్టి దిబ్బలను తొలగించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని వాహనదారులు, గ్రామస్థులు కోరుతున్నారు.


తోట్లవల్లూరులో యూకోబ్యాంకు ఎదుట ఆర్‌అండ్‌బీ రోడ్డుపై పగిలిన తూము


తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ఇసుక, బుసక మట్టి పేరుకుని ఏర్పడిన గోతులు

నివాస్ దంపతులను ఆశీర్వదించిన వెనిగండ్ల

గుడివాడ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : కంకిపాడులో బుధవారం జరిగిన టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కుమారుడు నివాస్, నర్మదల వివాహ వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. కల్యాణ మండప ప్రాంగణంలో మంత్రులు కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారధి, విజయవాడ ఎం.పి కేశినేని చిన్ని, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, సహచర ఎమ్మెల్యేలతో ఎమ్మెల్యే వెనిగండ్ల మాట్లాడుతూ నవ్వులు పంచుకున్నారు.


నివాస్ దంపతులను ఆశీర్వదిస్తున్న వెనిగండ్ల

మండల సమావేశం నేడు

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : నేడు మండలపరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నామని ఎంపీడీవో విజయసారథి తెలిపారు. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ సమావేశపు హాల్లో ఎంపీపీ అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశానికి అధికారులు హాజరు కావాలని ఆయన సూచించారు.

పూడికతీత పనులు ప్రారంభం

గుడివాడ రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : రైతులకు మేలు చేయాలని కూటమి ప్రభుత్వం పంట కాలువల్లో, మురుగు కాలువల్లో పేరుకుపోయిన పూడికతీత పనులు చేపడుతుందని సెరిగొల్లేపల్లి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నూతక్కి కుటుంబరావు అన్నారు. బుధవారం తట్టివర్రులో 2.5 కిలోమీటర్ల దూరం ఉన్న సీపూడి, రామన్నపూడి, తట్టివర్రు పొలాలకు మురుగు కాలువల పూడికతీత పనులు ప్రారంభించారు. సీపూడి, రామన్నపూడి, తట్టివర్రు గ్రామాల రైతులు ఎమ్మెల్యే వెనిగండ్ల రామును పూడికతీత పనుల విషయమై అడుగగా, నిధులు మంజూరు చేయించామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, పూడికతీత పనులు చేపట్టాలన్నారు. వలివర్తిపాడు నీటి సంఘం అధ్యక్షుడు లింగమనేని వీరబసవయ్య, గ్రామ టీడీపీ అధ్యక్షులు కైలా కాళిదాసు, గంజి సాంబశివరావు, కైలా రంజిత్ కుమార్, టీడీపీ నాయకులు సూరపనేని రామకృష్ణ, తట్టివర్రు గ్రామస్థులు పాల్గొన్నారు.


పూడికతీత పనులు ప్రారంభిస్తున్న కుటుంబరావు

యథేచ్ఛగా మట్టి తోలకాలు

గుడివాడ రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : మోటూరు తాగునీటి చెరువు (పెద్ద చెరువు)ను అనుమతులు లేకుండా గ్రామానికి చెందిన కొంతమంది కలసి బుధవారం మధ్యాహ్నం నుంచి మట్టి తోలకాలను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఈ చెరువు విస్తీర్ణం 13.5 ఎకరాలు ఉంది. గతంలో ఈ చెరువును పూడికతీత పనులు చేపట్టడానికి ఎండగట్టారు. డీఎల్‌పీవో అనుమతి కోసం పంపారు. కానీ ఉన్నతాధికారులు నిధులు లేవని చెరువుకు కాలువలు వస్తున్నందున నీళ్లు పెట్టాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో గ్రామంలో కొంతమంది నీరు పెట్టాలని, కొంతమంది చెరువు పూడికతీత పనులు చేయాలని ఘర్షణకు దిగారు. చెరువుపూడికతీత పనుల్లో అన్ని పార్టీల నాయకులు, కూటమి, వైసీపీ నేతలు సహాయ సహకారాలతో మట్టి తవ్వకాలు యథేచ్ఛగా ప్రారంభించారు. అనుమతులు లేకుండా గ్రామపంచాయతీ చెరువును కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు పనులు చేస్తుంటే ఉన్నతాధికారులు ప్రేక్షక పాత్ర వహించటం పట్ల మోటూరు వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్యదర్శి జగన్నాథరావు మెడికల్ లీవులో బుధవారం వెళ్లిపోయారు. సంబంధిత అధికారులు పట్టించుకుని చెరువు పూడికతీత పనులు అనుమతులు లేకుండా ప్రైవేట్ వ్యక్తులు చేపట్టడంపై మోటూరు వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక పూజలు

గుడివాడ రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : చిన ఎరుకపాడు గ్రామంలో వేంచేసి ఉన్న అష్టలక్ష్మీ ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు, ట్రస్టీ సభ్యులు, అర్చకుల ఆధ్వర్యంలో కుటుంబ సమేతంగా నవగ్రహ పూజలు, ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ట్రస్టీ సభ్యుల ఆధ్వర్యంలో వేద పండితుల నడుమ వందలాది మంది భక్తుల మధ్య హోమాలు జరిగాయి.


హోమం నిర్వహిస్తున్న భక్తులు

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

పామర్రు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన పదోతరగతి, ఇంటర్మీడియట్ పరిక్షా ఫలితాల్లో అత్యంత ప్రతిభతో ఉత్తీర్ణులైన విద్యార్థులకు విశ్రాంత డిఫెన్స్ ఉన్నతాధికారి వీరమాచినేని వేంకటేశ్వరరావు, రాధారాణి దంపతులు బుధవారం 15మంది విద్యార్థులకు రూ.30వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా వీవీ రావు మాట్లాడుతూ ఎంపీపీ పాఠశాల పెదమద్దాలి, జమీగొల్వేపల్లి గ్రామాలకు చెందిన విద్యార్థులు విద్యలో మరింతగా రాణించేందుకు ప్రోత్సహక నగదును బహుమతిగా అందజేస్తున్నామన్నారు. చదువుల్లో మంచి ప్రతిభ కనబరిచిన వారిని ఆదర్శంగా తీసుకుని క్రమశిక్షణతో విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెదమద్దాలి, జమీగొల్వేపల్లి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పీబీ శ్రీనువాసరావు, యార్లగడ్డ మృదుల, టి.ఉషారాణి, వ్యాయమ ఉపాధ్యాయుడు రవిబాబు, శేషగిరిరావు కాంద్రు ఏసురత్నం, పండుబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విద్యార్థులకు ప్రోత్సహకాలు అందిస్తున్న విశ్రాంత డిఫెన్స్ అధికారి వీవీ రావు దంపతులు

రక్తనిధి కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

• డాక్టర్ మాగంటి శ్రీనివాస్

గుడివాడ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : గుడివాడలో అన్నిహంగులతో, ఆధునిక టెక్నాలజీతో రక్తాన్ని నిల్వచేసుకునేలా రక్తనిధి కేంద్రం అందుబాటులో ఉండటం ఎంతో ఉపయోగకరమని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుడివాడ శాఖ అధ్యక్షుడు డాక్టర్ మాగంటి శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక ఏలూరురోడ్డులో నూతనంగా ఏర్పాటుచేసిన ఏపీ వాలంటరీ బ్లడ్ బ్యాంకును ప్రముఖ వైద్యులు డాక్టర్ యమ్.భవానీశంకర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. తొలుత స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము రక్తనిధి కేంద్రానికి విచ్చేసి నిర్వాహకులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు ప్రసాద్, కేంద్రం వైద్య అధికారి డాక్టర్ యమ్.సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.



రక్తనిధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్

మోదీ మాటలు ఒట్టి బూటకం : సీపీఎం

గుడివాడ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : దేశప్రధాని నరేంద్ర మోదీ 2014ఎన్నికల్లో దేశరాజధాని ఢిల్లీని తలదన్నేలా అమరావతిని నిర్మిస్తామని ప్రకటించి, చెంబుడు నీళ్ళు, గంపెడు మట్టితో సరిపెట్టారని, మోదీ చేప్పే మాటలన్నీ ఒట్టి బూటకమని సీపీఎం నాయకులు ఆర్‌సీపీ రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర పర్యటనకు వస్తున్న ప్రధాని మోదీకి సీపీఎం బహిరంగలేఖను విడుదల చేసింది. బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో వివాదాలను సృష్టించినప్పుడు అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం నోరు ఎందుకు విప్పలేదో బహిర్గతపరచాలన్నారు. అమరావతి నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు, హడ్కో సంస్థల ద్వారా రూ.31వేల కోట్ల అప్పును మంజూరు చేసినట్లు ప్రకటన మాత్రమే చేశారన్నారు. మరో రూ.1400కోట్లు గ్రాంట్‌గా ఇస్తున్నట్లు ప్రకటించి నేటికీ ఇవ్వలేదన్నారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి రాజధాని నిర్మాణానికి సక్రమమైన మార్గంలో నిధులు కేటాయించి త్వరగా అభివృద్ధి జరిగేందుకు సహకరించాలని, రాజధాని రక్షణ చట్టం చేయాలని ఆర్‌సీపీ డిమాండ్ చేశారు.


భక్తులకు మజ్జిగను పంపిణీ చేస్తున్న ఆలయ ఈవో గోపాలరావు

భక్తులకు మజ్జిగ పంపిణీ

గుడివాడ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : స్థానిక గంగాపార్వతీ సమేత భీమేశ్వరస్వామి దేవస్థానం, దేవరకొండ నాగన్న అన్నదాన సత్రాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.వి. గోపాలరావు తెలిపారు. బుధవారం స్థానిక దేవస్థానం వద్ద ఉచిత మజ్జీగ పంపిణీ కార్యక్రమాన్ని గుడివాడ డివిజన్ ఆలయాల తనిఖీదారు వి.సుధాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు, సిబ్బంది కె.వి. లక్ష్మీ, జి.నాగ మౌనిక, జి.శిరీష తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతకు వేసవి శిక్షణలు దోహదం


పామర్రు గ్రంథాలయంలో..

పామర్రు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వేసవి శిక్షణా తరగతులు పిల్లల్లో సృజనాత్మకత శక్తి పెంపొందింపజేస్తామని పామర్రు జిల్లా గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీరాణి అన్నారు. గ్రంథాలయాల్లో పిల్లలకు నిర్వహిస్తున్న వేసవి తరగతుల్లో భాగంగా బుధవారం చిన్నారులకు, క్రీడలవల్ల ప్రయోజనాలు, స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ, అంకెల గారడిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు. ఇదే విధంగా మండల పరిధిలో జమీగొల్వేపల్లి గ్రంథాలయంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.నాగసురేష్, గ్రామ మహిళ మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : మండలంలోని శాఖాగ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారిణి వాణి తెలిపారు. బుధవారం సర్వేపల్లి రాధాకృష్ణన్ గురించి విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. అనంతరం వారికి నచ్చిన కథల పుస్తకాలను చదివించారు. అనంతరం వాలీబాల్, క్యారమ్స్ పిల్లతో ఆడించారు.


గుడ్లవల్లేరు గ్రంథాలయంలో..


పెదపారుపూడి గ్రంథాలయంలో..

పెదపారుపూడి: యలమర్రు గ్రామంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగుతులు, సమ్మర్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే కథలు, పుస్తకాలు చదివించారు. చెక్, క్యారమ్స్ ఆటలు నేర్పించారు. సుమతి శతక పద్యములు మరెన్నో విషయాలపై అవగాహన కల్పించారు. గ్రంథాలయ అధికారిణి జె.విజయలక్ష్మి, పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధాని సభను విజయవంతం చేయాలి

• ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతి నిర్మాణ పనులు పునఃప్రారంభం కావడం శుభ సూచకమని, ప్రధాని సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి కొత్తపల్లి జవహర్, ఎమ్మెల్యే వెనిగండ్ల రాములు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రజావేదికలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి, పక్కా ప్రణాళికతో అమరావతి ఎకనమిక్ ఫోర్స్‌గా అభివృద్ధి చెందుతుందన్నారు. అమరావతి పునఃప్రారంభ పండుగలో ప్రజలందరూ పాల్గొనేలా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఎండల దృష్ట్యా పాల్గొనే ప్రతి ఒక్కరిని జాగ్రత్తగా ఇంటికి చేర్చేలా అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 170బస్సులను కేటాయించామన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు నూకాలమ్మ, పట్టణ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, మండల అధ్యక్షుడు మురళీ, దానేటి సన్యాసిరావు, సీనియర్ నాయకులు కంచర్ల సుధాకర్, చాట్రగడ్డ రవి, పాల్గొన్నారు.

పెదపారుపూడి : మే 2వ తేదీన అమరావతిలో నిర్వహించబోయే అమరావతి పునఃనిర్మాణ కార్యక్రమం జయప్రదం చేయాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పిలుపునిచ్చారు. బుధవారం వెంట్రప్రగడలోని కల్యాణమండపంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. ప్రధాని పాల్గొనే అమరావతి పునఃనిర్మాణ కార్యక్రమంలో కూటమి నేతలు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పరిశీలకులు కోట వీరబాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధా జగదీష్, మండల జనసేన అధ్యక్షుడు పోలిశెట్టి సురేష్, కార్యదర్శి ఎం.రాంబాబు, సూరపనేని వెంకట సత్యనారాయణ, కూచిపూడి సుబ్బయ్య, ముఖ్యనేతలు, టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల, మాజీ మంత్రి జవహర్

పమిడిముక్కల : అమరావతిలో శుక్రవారం జరిగే ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభకు ప్రజలువేలాదిగా తరలి వచ్చి సభను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు పిలుపునిచ్చారు. పమిడిముక్కల మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం జరిగిన స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజధాని పునర్నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ప్రధాని మోదీ హాజరవుతున్న సందర్భంగా మండలంనుంచి వేలాదిగా ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు జక్కా శ్రీనివాసరావు, జనసేన, బీజేపీ నాయకులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.


వృద్ధులకు భోజనవసతి కల్పిస్తున్న శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం నేతలు

వృద్ధులకు భోజన వసతి

గుడివాడ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : స్థానిక మమత వృద్ధాశ్రమంలో బుధవారం చలసాని లక్ష్మీ జన్మదినం సందర్భంగా వారి కుటుంబసభ్యుల సహకారంతో శ్రీకృష్ణయాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో వృద్ధులకు భోజన వసతిని కల్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టి హరికుమార్, సభ్యులు మునీంద్ర, తాతారావు, హరిబాబు, రామారావు తదితరులు పాల్గొన్నారు.